SUVARNA SOOKTULU

(Golden Words of Islam)

# సువర్ణ సూక్తులు

కూర్పు: అబుల్ ఇర్ఫాన్

ISLAMIC RESOURCE CENTRE
SAHARA COMPLEX, PATHARGATTI
HYDERABAD-2, Ph: 944 1515 414

Price.......................................Rs.15/-



## విషయ సూచిక


| నెం. | విషయం | పేజి |
|---|---|---|
| 1. | చదువు నీ ప్రభువు పేరుతో | 3 |
| 2. | ఆధారం-ప్రమాణం | 4 |
| 3. | ప్రారంభం (ఫాతిహాసూరా) | 5 |
| 4. | హదీస్ దర్పణంలో ఖుర్ఆన్ | 8 |
| 5. | తల్లిదండ్రుల హక్కులు | 10 |
| 6. | సంతానం హక్కులు | 13 |
| 7. | భార్య హక్కులు | 15 |
| 8. | భర్త హక్కులు | 17 |
| 9. | బంధువుల హక్కులు | 19 |
| 10. | మానవ హక్కులు | 21 |
| 11. | దేవుని హక్కులు | 23 |
| 12. | ముస్లింల పరస్పర సంబంధాలు | 26 |
| 13. | సమైక్యతే అసలైన శక్తి | 29 |
| 14. | ఆరాధనా భావం | 31 |
| 15. | ఇస్లాం మూలస్తంభాలు | 33 |
| 16. | నైతిక విలువలు | 36 |
| 17. | జవాబుదారీ భావన | 38 |
| 18. | తెలుగు లిపి సూరాలు | 40 |
| 19. | వేడుకోలు షరతులు | 50 |
| 20. | ఖుర్ఆన్ దుఆలు | 53 |
| 21. | హదీస్ దుఆలు | 56 |
| 22. | మరువరాని మాటలు | 62 |




## 1. 'చదువు' నీ ప్రభువు పేరుతో

✦ "సర్వ సృష్టికర్త అయిన నీ ప్రభువు పేరు స్మరించి పఠించు. ఆయనే మానవుడ్ని గడ్డకట్టిన రక్తంతో సృజించాడు. చదువు నీ ప్రభువు మహోన్నతుడు, ఎంతో ఉదారుడు. ఆయన మానవునికి కలం ద్వారా అతను ఎరగని జ్ఞానం నేర్పాడు." (ఖుర్ఆనః 96:1-5)

✦ "వారు ఖుర్ఆన్ గురించి ఆలోచించరా? ఇది అల్లాహ్ నుండి గాకుండా మరెవరి నుండో వచ్చివుంటే ఇందులో ఎంతో భావవైరుధ్యం ఉండేది కదా!" (ఖుర్ఆన్-4:82)

✦ "సకల సృష్టిరాసులు ఆయన ఆజ్ఞే శిరసావహిస్తున్నాయి. వినండి! సృష్టి ఆయనదే, ఆజ్ఞ (అధికారం) కూడా ఆయనదే. సకలలోక ప్రభువైన ఆ దేవుడు ఎంతో శుభదాయకుడు." (ఖుర్ఆన్-7:54)

✦ "ముస్లింలైనా, యూదులైనా, క్రైస్తవులైనా, నక్షత్రారాధకులైనా, మరెవరైనా సరే దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసించి తదనుగుణంగా సత్కార్యాలు చేస్తుంటే, అలాంటి వారికి (ప్రళయదినాన) ఎలాంటి భయం గాని, దుఃఖంగాని ఉండదు." (ఖుర్ఆన్-5:69)

✦ "విశ్వాసులారా! దేవునిపట్ల, ఆయన ప్రవక్త పట్ల విధేయత కలిగి ఉండండి. మీలో వ్యవహారకర్తలైన అధికారుల పట్ల కూడా. అయితే ఏదైనా వ్యవహారంలో మీ మధ్య వివాదం తలెత్తితే దాన్ని తిరిగి దేవుని వైపునకు, ఆయనప్రవక్త వైపునకు మరల్చండి. మీరు నిజంగా దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసిస్తున్నట్లయితే ఇదే మీకోసం సరయిన పద్ధతి. పర్యవసానం రీత్యా కూడా ఇదే ఉత్తమ విధానం." (ఖుర్ఆన్-4:59)

✦ "విశ్వాసుల హృదయాలు దేవుని ప్రస్తావనతో ద్రవించే సమయమింకా రాలేదా? ఆయన పంపిన సత్యం ముందు లొంగిపోయే వేళ ఆసన్నం కాలేదా?" (ఖుర్ఆన్-57:16)



آیاتها ٧ (١) سُورَةُ الْفَاتِحَةِ مَكِّيَّةٌ (٥) رکوعها ١

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

الْحَمْدُ لِلَّهِ رَبِّ الْعَالَمِينَ ﴿٢﴾ الرَّحْمَٰنِ الرَّحِيمِ ﴿٣﴾ مَالِكِ يَوْمِ الدِّينِ ﴿٤﴾
إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِينُ ﴿٥﴾ اهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيمَ ﴿٦﴾
صِرَاطَ الَّذِينَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوبِ عَلَيْهِمْ وَلَا الضَّالِّينَ ﴿٧﴾

అవతరణ: మక్కా

## 3. ప్రారంభం-1

సూక్తులు:7

*ఈ అధ్యాయాన్ని ఫాతిహా (ప్రారంభం) అంటారు. అంటే ఖుర్ఆన్‌కు ఇది ప్రారంభ అధ్యాయం అన్నమాట. ఇది మహనీయ ముహమ్మద్ (స) దైవప్రవక్తగా నియమించబడిన ప్రారంభకాలంలో అవతరించింది. ఇందులో భక్తుడు సృష్టికర్తను స్తుతించి తనకు రుజుమార్గం చూపమని వేడుకుంటాడు. దానికి సమాధానంగా దేవుడు, నీవు కోరుతున్న రుజుమార్గం ఇదేనంటూ మొత్తం ఖుర్ఆన్‌ని భక్తుని ముందుంచుతాడు.*

**కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం.**

సమస్త లోకాలకు స్వామి, ప్రభువు అయిన అల్లాహ్‌కే సకల విధాల ప్రశంసలు శోభిస్తాయి. ఆయన కరుణామయుడు, కృపాసాగరుడు. పరలోక విచారణ దినానికి అధిపతి కూడా ఆయనే. (1-3)

దేవా! మేము నిన్నే ఆరాధిస్తున్నాము. నీ సహాయమే అర్థిస్తున్నాము. మాకు రుజుమార్గం చూపు. నీ ఆగ్రహానికి గురయి దారి తప్పినవారి మార్గం కాకుండా, నీ అనుగ్రహానికి పాత్రులయినవారి మార్గమే మాకు చూపించు. (4-7)

**వివరణ:** యావత్తు మానవాళిని సృష్టించి, పోషించి, పాలించే దేవుడు మాత్రమే మానవులకు రుజుమార్గం చూపగలుగుతాడు. అందువల్ల ఆయన మాత్రమే ఆరాధనకు అర్హుడు. మిగిలిన వారంతా సృష్టితాలు, దాసులు మాత్రమే. అలాగే మానవులు పరస్పరం సహాయ సహకారాలు అందజేసుకుంటున్నప్పటికీ అసలు సహాయం చేసేవాడు దేవుడు మాత్రమే. కాబట్టి మానవులు తమ అవసరాల కోసం ఆయన్నే అర్థించాలి.

ఏకేశ్వర భావం ప్రతి మానవుని నైజంలోనే వేళ్ళూని ఉంది. అయితే ఆచరణలోనే అనేక మంది ఈ సత్యానికి కట్టుబడి ఉండలేక పోతున్నారు. ఒకే దేవుణ్ణి ఆరాధిస్తున్నామని చెబుతూనే కొన్ని చేష్టల ద్వారా బహుదైవోపాసనకు పాల్పడుతున్నారు. దీనికి కారణం దివ్యావిష్కృతి (Revelation)ని పొందిన దైవప్రవక్తలను గుర్తించకపోవడం, గుర్తించినా వారి బోధనలను మార్చివేయడం, పెడర్థాలు తీయడం, ఆయా మార్పులకు, పెడర్థాలకు 'సహేతుకమైన' సాకులు చూపి తమ వాదనలే నిజమని నిరూపించడానికి వృథాప్రయాస పడటం జరుగుతోంది.

దేవుళ్ళు అనేక మంది ఉన్నారని భావించినప్పుడు "కస్మై దేవాయ హవిషా విధేమ?" (ఏ దేవునికి మా హవిస్సుల నివ్వవలెను?) అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఈ ప్రపంచానికి, ఇక్కడి సుఖదుఃఖాల వ్యవస్థకు కారణం' 'ఏకోబ్రహ్మమే" అని నిర్ధారించుకున్నప్పుడు "ఆ బ్రహ్మ లక్షణాలు ఏవి?" అనే మరో ప్రశ్న ఉద్భవిస్తుంది. ఆ బ్రహ్మ లక్షణాలన్నీ కలిగివున్న సమగ్ర పదమే "అల్లాహ్". 'అల్+ఇలాహ్' అనే రెండు పదాలు కలసి ఒకే దేవుడు, (The God) అనే భావం స్ఫురించేలా 'అల్లాహ్' అనే పదం ఏర్పడింది. ఈ పదమే ఆ శుద్ధ ఏకబ్రహ్మకు నామవాచకమై పోయింది.

"ఇలాహ్" అంటే ఆపద సమయంలో ఆదుకునేవాడు, భయాందోళనలు కలిగినప్పుడు శాంతి స్థిమితాలు ప్రసాదించేవాడు, కష్టాలు కడతేర్చి సుఖాన్నిచ్చేవాడు, శరణు గోరినవారికి ఆశ్రయ మిచ్చేవాడు, కోరికలు తీర్చేవాడు



అని నానార్థాలు ఉన్నాయి. అరబీ భాషలో ఈ పదాలలో ఆధిక్యతా భావం (Supremacy) కూడా ఇమిడి ఉంది.

ఆధిక్యత ఉన్న చోటికే అవసరార్థులు గుమికూడటం సహజం. కనుక ఆధిక్యత కలిగివున్నవాడు అర్థులకు ఆరాధ్యుడై పోతాడు. ఈ విధంగా 'ఇలాహ్' అనే పదంలో అర్థించదగినవాడు, ఆరాధించదగినవాడు, ఆశ్రయ మిచ్చేవాడు, ఆపదల మొక్కులవాడు అనే అర్థాలు ఉన్నాయి. బహుదైవారాధ్య భావం కలిగిన వారంతా ఈ అర్థాల్లోనే అసాధారణశక్తి ఉందని భావించిన ప్రతి సృష్టితాన్ని (Creature) పూజించడం ప్రారంభించారు.

అయితే ఇస్లాం ఏకేశ్వరవాదానికి సంబంధించిన విశ్వాసానికి, ఆచరణకు మధ్య ఉన్న వైరుధ్యాన్ని ఖండించింది. ఆ 'ఇలాహ్' (ఆరాధ్యుడు) ఒక్కడేనని, ఆయన్నే వేడుకోవాలని, జీవితంలోని ప్రతి వ్యవహారంలోనూ ఆయన ఆజ్ఞల్ని మాత్రమే శిరసావహించాలని చెబుతోంది.

దైవప్రవక్త (స) ఒక హదీసులో దేవుని మాటలు ఇలా తెలిపారు:

"నా దాసులారా! నేను మార్గం చూపినవాడు తప్ప మీలో ప్రతి ఒక్కడూ మార్గవిహీనుడే. అందువల్ల సన్మార్గం చూపమని నన్ను వేడుకోండి, నేను మీకు సన్మార్గావలంబన బుద్ధి ప్రసాదిస్తాను. నా దాసులారా! నేను ఉపాధి ప్రసాదించినవాడు తప్ప మీలో ప్రతి ఒక్కడూ క్షుత్బాధితుడే. కనుక ఉపాధి ప్రసాదించమని నన్ను మొరపెట్టుకోండి, నేను మీకు ఉపాధి నిస్తాను. నా దాసులారా! నేను వస్త్రాలు ప్రసాదించినవాడు తప్ప మీలో ప్రతి ఒక్కడూ వస్త్రవిహీనుడే. కావున వస్త్రాలు ప్రసాదించమని నన్ను అర్థించండి, నేను మీకు వస్త్రాలు ప్రసాదిస్తాను. నా దాసులారా! మీలో ప్రతి ఒక్కడూ రేయింబవళ్ళు పాపాలు చేస్తున్నవాడే. నేను మీ పాపాలన్నీ క్షమిస్తాను. కనుక మీరు పాపక్షమాపణ కోసం నన్ను ప్రార్థించండి, నేను మీ పాపాలు క్షమిస్తాను." (ముస్లిం) ❁



## 2. ఆధారం-ప్రమాణం

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) మహితోక్తి : "నేను మీ దగ్గర రెండు వస్తువులు వదలిపెట్టి పోతున్నాను. ఈ రెండిటిని దృఢంగా పట్టుకొని ఆచరించేవారు ఎన్నటికీ దారితప్పరు. వాటిలో ఒకటి దైవగ్రంథం (ఖుర్ఆన్) రెండు, నా ప్రవచనాలు, సంప్రదాయాలు (హదీస్)." (తిర్మిజి)

మతవ్యవహారంలో ముస్లింలు చేసే ప్రతి పనికీ ఆధారం, ప్రమాణం ఉండాలని పై హితోక్తి స్పష్టంగా తెలియజేస్తోంది. విధేయత, సమర్పణ, శాంతి అనే భావాలు స్ఫురింపజేసే 'ఇస్లాం' ధర్మానికి రెండే రెండు మూలాధారాలు లేక ప్రమాణాలు ఉన్నాయి. అవే ఖుర్ఆన్, హదీస్. ఈ రెండిటికి వ్యతిరేకంగా ఉండే ప్రతి విషయమూ అపమార్గానికి దారితీస్తుంది.

అంతేకాదు, కొందరు ముస్లింలు కొన్ని ఖుర్ఆన్ సూక్తులు, హదీస్ ఉల్లేఖనాలు ఉండే పుస్తకాలకు ఖుర్ఆన్, హదీస్ గ్రంథాల కంటే ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వడం కూడా మంచిది కాదు. ముఖ్యంగా ఖుర్ఆన్ని విస్మరించడం కన్నా మరొక దురదృష్టం లేదు. ఇది ముస్లింలకు నిత్య పఠనగ్రంథం (పాఠ్య గ్రంథం). ఖుర్ఆన్ అంటే అర్థం కూడా ఇదే.

ఈ కారణంగానే సృష్టికర్త ముస్లింల కోసం రోజుకు అయిదు సార్లు (ఖుర్ఆన్ పఠనంతో కూడిన) నమాజ్ చేయాలని నిర్దేశించాడు. ఎందుకు? దాసుడు నమాజ్లో క్రమం తప్పకుండా ప్రతిరోజూ అయిదు సార్లు ఖుర్ఆన్ చదువుతూ తన క్రియాజీవితంలో దాని ఆదేశాలను, హితవులను పాటించాలన్న లక్ష్యంతోనే ఈ ఆజ్ఞ ఇవ్వబడింది.

అయితే ఈ లక్ష్యం ఖుర్ఆన్ని అర్థం చేసుకుంటూ చదివినప్పుడే నెరవేరుతుంది. అరబీ రానివారు తమకు తెలిసిన భాషలో ఖుర్ఆన్ అనువాదం చదువుతుండాలి. అనువాదం చదవకుండా అరబీ పారాయణం చేయడం వల్ల పఠన పుణ్యమయితే లభిస్తుంది కాని, క్రియాజీవితంలో మనం షైతాన్ విషవలయం నుండి తప్పించుకోలేము. ❖



## 4.హదీసు దర్పణంలో ఖుర్ఆన్

✿ దేవుడు ఈ గ్రంథం ద్వారా కొందరిని ఉద్ధరిస్తాడు, మరికొందరిని పడదోస్తాడు. (ముస్లిం)

✿ ఖుర్ఆన్ విద్య నార్జించి, దాన్ని ఇతరులకు నేర్పేవారే మీలో అందరి కంటే శ్రేష్ఠులు. (బుఖారి)

✿ ఎవరైనా ఖుర్ఆన్ నిషేధించిన విషయాల్ని ధర్మసమ్మతం చేసుకున్నాడంటే, అతనసలు ఖుర్ఆన్ని విశ్వసించనే లేదన్నమాట. (తిర్మిజి)

✿ ప్రళయదినాన ఖుర్ఆన్ని, దాని ప్రకారం ఆచరించినవారిని (దైవ న్యాయస్థానానికి) తీసుకురావడం జరుగుతుంది. అప్పుడు వారి ముందు బఖరా, ఆలిఇమ్రాన్ సూరాలు నల్లటి మబ్బు తునకల రూపంలో (నీడనిచ్చి) నడుస్తుంటాయి. వాటి క్రింది భాగాన వెలుగు ఉంటుంది. లేదా ఆ రెండు సూరాలు రెక్కలు చాచిన పక్షుల గుంపులా పైన ఎగురుతూ వారిని అనుసరిస్తాయి. ఇలా ఈరెండు సూరాలు తమను పఠించినవారికి అనుకూలంగా సాక్ష్యమిస్తూ వస్తాయి. (ముస్లిం)

✿ జాగ్రత్త! సమీపకాలంలో ఒక పెద్ద కల్లోలం తలెత్తుతుంది.... ఖుర్ఆన్ ద్వారా మాత్రమే మీరు దీని బారినుండి బయటపడ గల్గుతారు. ఈ గ్రంథంలో మీకు పూర్వం గతించిన జాతులు చవిచూసిన పర్యవసానాలు కూడా ఉన్నాయి; మీతర్వాత రాబోయేవారికి ఎదురయ్యే పరిణామాలు కూడా ఉన్నాయి: ఇంకా ఈ గ్రంథంలో మీ దైనందిన వ్యవహారాలకు సరైన పరిష్కారమార్గాలు కూడా ఉన్నాయి....ఈ గ్రంథం ఆషామాషీ వాక్కు కాదు. ఇది గంభీరమైన, నిర్ణయాత్మకమైన వాణి. దుర్మార్గుడయి ఈ గ్రంథాన్ని విడనాడిన క్రూరుణ్ని దేవుడు అణగద్రొక్కి వేస్తాడు. దీన్ని వదిలి వేరేచోటు నుండి మార్గదర్శకత్వం పొందదానికి ప్రయత్నించేవాడ్ని దేవుడు మార్గభ్రష్టుడిగా చేస్తాడు. ఈగ్రంథం దేవుడు పంపిన పటిష్ఠమైన త్రాడు. ఇది వివేకవంతమైన హితవాణి. ఇదే సరైన దారి (ముక్తిమార్గం)--- (తిర్మిజి, దార్మి)

✿ ప్రళయం సమీపంలో (ధర్మ)జ్ఞానం తీసేసుకోవడం జరుగుతుంది... దేవుడు జ్ఞానం తీసేసు కుంటాడంటే ప్రజల హృదయాల నుండి తొలిగిస్తా దని అర్థం కాదు. జ్ఞానం తీసుకోవడమంటే ధర్మవేత్తలు లోకం నుండి క్రమంగా అంతరించి పోతారు. ఒక్క ధర్మవేత్త కూడా లేకుండా అందరూ అంతరించిన తర్వాత జనం మూర్ఖుల్ని నాయకులుగా చేసుకుంటారు. ఆ మూర్ఖులు ప్రజలు అడిగిన విషయాలకు జ్ఞానం లేకుండా ఫత్వాలు (తీర్పులు) ఇస్తారు. ఈవిధంగా వారు స్వయంగా దారి తప్పడమే గాకుండా ప్రజల్ని కూడా దారి తప్పిస్తారు. (బుఖారి, ముస్లిం)

✿ ఖుర్‌ఆన్‌ని చదవాల్సిన విధంగా చదవండి. రేయింబవళ్ళు చదవండి. దాన్ని వ్యాపింపజేయండి. అందులోని విషయాలను పరిశీలించండి, మీ జీవితం సార్థకమవుతుంది.

✿ ఎవరు ఖుర్‌ఆన్‌ని అధ్యయనం చేసి దాని ప్రకారం ఆచరిస్తాడో, ప్రళయ దినాన (దైవదూతలు) అతని తల్లిదండ్రులకు ఒక కిరీటం పెడతారు. ఆ కిరీటం సూర్యుని కంటే ఎక్కువ తేజస్సుతో ప్రకాశిస్తుంది. (బుఖారి, ముస్లిం)

✿ రెండు విషయాల పట్ల ఈర్ష్య పడటం ధర్మసమ్మతమే. అందులో ఒక విషయం.... దేవుడు ప్రసాదించిన ఖుర్‌ఆన్ జ్ఞానంలో (చదవడం, వ్రాయడం, నేర్పడం, ప్రచారం చేయడం వగైరా కార్యకలాపాలలో) రేయిం బవళ్ళు నిమగ్నుడయి ఉండేవాడు. (బుఖారి, ముస్లిం)

✿ దాసుని విముక్తి కోసం ఖుర్‌ఆన్, ఉపవాసాలు సిఫారసు చేస్తాయి.... ఖుర్‌ఆన్ దైవాన్ని వేడుతూ 'ప్రభూ! నేనితడ్ని రాత్రివేళ నిద్ర పోకుండా చేశాను. (ఇతడు నన్ను చదువుతూ లేక వింటూ జాగారం చేశాడు.) కనుక ఇతని విషయంలో నా సిఫారసు అంగీకరించు' అని అంటుంది. ఇలా చివరికి వారిద్దరి సిఫారసు ఆమోదించబడుతుంది." (మిష్కాత్) ⭘



## 5. తల్లిదండ్రుల హక్కులు

"తల్లిదండ్రుల పట్ల సద్భావంతో మసలుకోండి. మీ ముందు వారిద్దరిలో ఎవరైనా వృద్ధులైఉంటే వారిని 'ఉఫ్' అనికూడా విసుక్కోకండి. కసురు కుంటూ విదిలించి మాట్లాడకండి. వారితో గౌరవంగామాట్లాడండి; దయార్ద్ర హృదయంతో, వినయంతో వారి ముందు తలవంచిఉండండి. 'ప్రభూ! వీరు నన్ను చిన్నతనంలో ఎలా కరుణతో, వాత్సల్యంతో పెంచి పోషించారో అలా నీవు వీరిని కరుణించు' అని ప్రార్థించండి." (ఖుర్‌ఆన్-17:23,24)

"నాపట్ల కృతజ్ఞుడై ఉండు. నీ తల్లిదండ్రుల పట్ల కూడా కృతజ్ఞతాభావం తో మసలుకో. నీవు (చివరికి) నా దగ్గరికే రావలసిఉంది. అయితే నీకు తెలియనిదాన్ని నాకు సాటి కల్పించమని వత్తిడిచేస్తే మటుకు నీవు వారి మాట వినకు. ప్రపంచంలో వారి పట్ల సత్ప్రవర్తన కలిగిఉండు. అనుసరణ విషయంలో మాత్రం నావైపు మరలినవారి మార్గాన్నే అనుసరించు. చివరికి మీరంతా నా దగ్గరికే తిరిగిరావలసి ఉంది." (ఖుర్‌ఆన్-31:15)

ప్రవక్త అనుచరులలో ఒకతను దైవప్రవక్త (స)ను "దేవునికి అన్నిటికన్నా ఎక్కువ ఇష్టమైన సదాచరణ ఏద"ని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "వేళకు నమాజు చేయడం"అని చెప్పారు. "ఆతర్వాత ఏద"ని అడిగాడు అనుచరుడు. "తల్లిదండ్రుల పట్ల సత్ప్రవర్తన కలిగివుండటం" అన్నారు దైవప్రవక్త (స). "ఆ తర్వాత ఏద"ని ప్రశ్నించాడతను. "దైవమార్గంలో పోరాడటం" అన్నారు దైవప్రవక్త (స)." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "వృద్ధులైన తల్లి దండ్రులు ఇద్దరుగాని లేక వారిలో ఒకరుగాని బ్రతికుండగా (వారికి సేవచేసి) స్వర్గంలో ప్రవేశించ లేకపోయినవాడి ముక్కుకు మన్ను తగల! వాడి ముక్కుకు మన్ను తగల!! వాడి ముక్కుకు మన్ను తగల!!!" ఇలా ఆయన మూడు సార్లు శపించారు. (ముస్లిం)



ఒకతను దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "నేను (ధర్మస్థాపన కోసం) హిజ్రత్ (వలస) చేస్తానని, జిహాద్‌లో పాల్గొంటానని ప్రమాణం చేసి మీతో అంటున్నాను. దీనివల్ల నాకు దైవం నుండి పుణ్యం లభించాలని కోరు కుంటున్నాను" అని అన్నాడు. దైవప్రవక్త (స) ఈమాట విని "నీ తల్లి దండ్రులలో ఎవరైనా జీవించివున్నారా?" అని అడిగారు. దానికా వ్యక్తి "ఉన్నారు, ఇద్దరూ జీవించే ఉన్నారు" అని చెప్పాడు. "నువ్వు నిజంగానే దేవుడు నీకు పుణ్యం ప్రసాదించాలని కోరుకుంటున్నావా?" అని అడిగారు దైవప్రవక్త (స) మళ్ళీ. ఆ వ్యక్తి ఔనన్నాడు. అప్పుడు దైవప్రవక్త (స) "అలాగైతే నువ్వు నీ తల్లిదండ్రుల దగ్గరకు తిరిగివెళ్ళిపో. వారిద్దరికీ బాగా సేవ చెయ్యి. (అందులో నీకు హిజ్రత్, జిహాద్‌ల కంటే ఎక్కువ పుణ్యం లభిస్తుంది.)" అని ఉపదేశించారు. (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) మాట్లాడుతూ "ఘోరపాపాల్లో తల్లిదండ్రుల్ని దూషించ డం కూడా ఉంది" అన్నారు. అనుచరులు ఈమాట విని "ఎవరైనా తమ తల్లిదండ్రుల్ని దూషిస్తారా"అన్నారు ఆశ్చర్యపోతూ. దానికి దైవప్రవక్త (స) "ఆ...ఇతను మరొకని తండ్రిని దూషిస్తే అతను ఇతని తండ్రిని దూషిస్తాడు. అలాగే ఇతను మరొకని తల్లిని దూషిస్తే అతను ఇతని తల్లిని దూషిస్తాడు. (ఇలా మనిషి ఇతరుల తల్లిదండ్రుల్ని దూషించి తన కన్న తల్లిదండ్రుల్నే దూషించిన వాడవుతాడు.)- (బుఖారి, ముస్లిం)

ఒకసారి దైవప్రవక్త (స) దగ్గరకు కూర్చొని బనూసలమా తెగకు చెందిన ఒకతను వచ్చి "దైవప్రవక్తా! నా తల్లిదండ్రులు చనిపోయిన తరువాత కూడా నేను వారికి చేయవలసిన సేవ ఏదైనా ఉంటుందా?" అని అడి గాడు. దానికి దైవప్రవక్త (స) "ఉంటుంది. వారి శ్రేయస్సు మన్నింపుల కోసం దైవాన్ని వేడుకోవాలి: వారు చేసిపోయిన ప్రమాణాలను నెర వేర్చాలి; కేవలం వారి ద్వారానే కలిసే బంధుత్వాలను కలపాలి; వారి స్నేహితుల్ని గౌరవించాలి" అని చెప్పారు. (అబూదావూద్)



*పిల్లవాడి పుట్టుక, పోషణల విషయంలో తండ్రి శ్రమ-త్యాగాల కన్నా తల్లి శ్రమ-త్యాగాలే ఎక్కువగా ఉంటాయి. కనుక న్యాయంరీత్యా సంతానంపై తండ్రిహక్కుల కన్నా తల్లిహక్కులే ఎక్కువగా ఉంటాయి.*

ఒకతను దైవప్రవక్త (స)ను "నేను సేవ చేయదానికి నా తల్లిదండ్రులలో ఎవరెక్కువ హక్కుదారులు?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త "నీ తల్లి" అని సమాధానమిచ్చారు. అతను "ఆ తరువాత ఎవర"ని ప్రశ్నించాడు. దానికి కూడా దైవప్రవక్త (స) "నీ తల్లి" అనే సమాధానమిచ్చారు. ఆ వ్యక్తి తిరిగి "ఆ తరువాత ఎవర"ని అడిగాడు. దైవప్రవక్త (స) "నీ తల్లి" అనే జవాబిచ్చారు. అతను మళ్ళీ "ఆ తరువాత ఎవర"ని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "నీ తండ్రి" అని చెప్పారు. (బుఖారి, ముస్లిం)

ఒకతను దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "నావల్ల పెద్ద పాపం జరిగి పోయింది. దీనికి నిష్కృతి ఏదైనా ఉందంటారా?" అనడిగాడు. దైవప్రవక్త (స) ఈ మాట విని "నీ తల్లి (జీవించి) ఉందా?" అని ప్రశ్నించారు. దానికా వ్యక్తి లేదన్నాడు. "పోనీ నీ పిన్నమ్మగాని, పెద్దమ్మగాని ఉందా?" అని అడిగారు దైవప్రవక్త (స). అతను ఉందన్నాడు. "అయితే ఆమె పట్ల మంచిగా ప్రవర్తిస్తూ ఉండు" అన్నారు దైవప్రవక్త (స). (తిర్మిజి)

అబూబకర్ (రజి) కుమార్తె అస్మా (రజి) దైవప్రవక్త (స)ను "దైవప్రవక్తా! నా తల్లి నన్ను చూడటానికి వచ్చింది. ఆమె అవిశ్వాసి. మరి నేనామె పట్ల మంచిగానే ప్రవర్తించాలా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "నీవు నీతల్లి హక్కు కూడా నిర్వహిస్తూ ఉండాలి" అని చెప్పారు. ( బుఖారి)

ఒకతను వచ్చి "నేను జిహాద్‌లో పాల్గొనాలని అనుకుంటున్నాను. మీ సలహా ఏమిట"ని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) నీ తల్లి బ్రతికే ఉందా?" అని అడిగారు. అతను "నా తల్లి బ్రతికే ఉంది" అన్నాడు. అప్పుడు దైవప్రవక్త (స) "అయితే నువ్వామెకు సేవ చేస్తూఉండు. ఆమె పాదాల క్రింద (నీ) స్వర్గం ఉంది" అని చెప్పారు. (నసాయి)

# 6. సంతానం హక్కులు

*ఇస్లాంలో తల్లిదండ్రులు కలుసుకున్నప్పటి నుంచే సంతానశిక్షణ ప్రారంభమవుతుంది. వారప్పుడు దైవప్రవక్త (సల్లం) నేర్పిన ఈ దుఆ (వేడుకోలు) పదాలు పఠిస్తారు:*

"దేవుని పేరుతో ప్రారంభిస్తున్నాం. దేవా! మమ్మల్ని షైతాన్ కీడు నుండి కాపాడు. నీవు మాకు ప్రసాదించే సంతానాన్ని కూడా షైతాన్ కీడు నుండి కాపాడు." (బుఖారి)

*సంతానశిక్షణ విషయమయి ఖుర్‌ఆన్‌లో హజ్రత్ లుఖ్మాన్ (అలైహి) తన కుమారునికి హితోపదేశం చేస్తూ ఇలా చెబుతారు:*

"కుమారా! నీవు నమాజ్ వ్యవస్థ నెలకొల్పు. (ప్రజలను) మంచిని గురించి ఆదేశించు, చెడు విషయాల నుండి వారించు. కష్టాలు వచ్చినప్పుడు సహనం వహించు. ఇవెంతో ధైర్యసాహసాలతో కూడిన విషయాలు. భూమిపై నిక్కుతూ నీల్గుతూ నడవకు. తననుతాను పొగడుకునే, మిడిసిపడేవాడ్ని దేవుడు ఏమాత్రం మెచ్చుకోడు. నీ నడవడిలో మధ్యేమార్గాన్ని అవలంబించు. నీ కంఠస్వరం కాస్త తగ్గించుకో. అన్ని స్వరాల కంటే గాడిద స్వరం అత్యంత కఠోరమైనది." (ఖుర్‌ఆన్–31:16-19)

"పిల్లవాడు పుట్టిన వెంటనే అతని చెవుల్లో దేవుని స్తుతి, దైవప్రవక్త (స) ప్రస్తావన పడగానే షైతాన్ అక్కడ్నుంచి పారిపోతాడు. పిల్లవాడు పుట్టిన ఏడవ రోజున అతనికి పేరుపెట్టాలి. (తప్పుడు అర్థం వచ్చే పేరు కాకుండా మంచిపేరు పెట్టాలి.) తరువాత తలవెంట్రుకలు గొరిగించి 'అఖీఖా' (జన్మ దినోత్సవం) చేయాలి." (తిర్మిజి)

దైవప్రవక్త (స) పిల్లలను అమితంగా ప్రేమించేవారు. "మన పెద్దలను గౌరవించని, మన పిన్నలపట్ల వాత్సల్యం చూపనివాడు మనలోనివాడు కాదు" అన్నారాయన. (హదీసు).



"తండ్రి తన సంతానాని కిచ్చే కానుకలలో మంచి విద్యాబుద్ధులు గరపడమే గొప్పకానుక. దానికి మించిన శ్రేష్ఠమైన కానుక మరేదీ లేదు." (తిర్మిజి) "తండ్రి తన కొడుకుకు విద్యాబుద్ధులు గరపడం కంటే మించిన గొప్ప ఉపకారం అతని నుండి మరేదీ లేదు." (తిర్మిజి)

ప్రళయదినాన మనిషితో అందరికన్నా ముందు జగడమాడేవారు అతని సంతానమే. వారు దేవునితో "దేవా! ఇతడ్ని గురించి మా ఫిర్యాదు తీసుకో. ఇతను మమ్మల్ని అధర్మ సంపాదనతో పోషించాడు. మాకు విధిగా నేర్పవలసిన విషయాలు ఇతను మాకు నేర్పలేదు. అందువల్ల మేము అజ్ఞానులుగా ఉండిపోయాము" అని అంటారు. (తిర్మిజి)

"దారిద్ర్యభయంతో మీ సంతానాన్ని చంపుకోకండి. మేము వారికీ ఆహారమిస్తున్నాం, మీకూ ఇస్తున్నాం. వారిని చంపడం ఘోరపాపం." (ఖురాన్–17:31)

"ఒక వ్యక్తికి ఓ కుమార్తె ఉండి, అతనా బాలికను సజీవసమాధి చేయకుండా, ఎలాంటి బాధలకు, అవమానాలకు గురిచేయకుండా, ఆమె కంటే కొడుక్కు ఎక్కువ ప్రాధాన్యమివ్వకుండా పోషించేవానికి దేవుడు స్వర్గం ప్రసాదిస్తాడు". (అబూదావూద్)

"ఏ దాసుని లేక దాసిపై దేవుడు కుమార్తెల బాధ్యత మోపినపుడు అతను లేక ఆమె కుమార్తెల పట్ల మంచిగా ప్రవర్తిస్తారో, ఆ బాలికలు అతడ్ని లేక ఆమెను నరకంనుండి కాపాడే సాధనాలు అవుతారు." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) హితోపదేశం చేస్తూ "(నరకాగ్నినుండి కాపాడే) దానాలలో గొప్ప దానం (సదఖా) ఏమిటో చెప్పనా?" అన్నారు. "తప్పకుండా చెప్పండి దైవప్రవక్తా!" అన్నారు అనుచరులు. అప్పుడాయన ఇలా చెప్పారు: "(విడాకులివ్వబడటం వల్లగాని, వితంతువయినందు వల్లగాని) నీ దగ్గరకు తిప్పిపంపబడిన నీ కుమార్తెకు నువ్వు తప్ప మరెవరూ సంపాదించి పెట్టేవారు లేనప్పుడు నువ్వామెకు మేలు చేయాలి." (ఇబ్నెమాజ)



# 7. భార్య హక్కులు

*పురుషుడు వివాహసందర్భంలో ఏదయినా కారణం వల్ల మహర్ చెల్లించలేకపోతే, వివాహం తరువాత వీలైనంత త్వరగా మహర్ చెల్లించాలి. ఇది భార్య హక్కు. భర్త నెరవేర్చవలసిన మొదటి బాధ్యత. తరువాత అతను తన స్తోమతను బట్టి ఆమె పోషణఖర్చులు భరించాలి.*

"ధనికుడు తన ఆర్థిక స్తోమతనుబట్టి ఈ పోషణ ఖర్చులు భరించాలి. తక్కువ ఉపాధి ఇవ్వబడినవాడు దేవుడు తనకిచ్చిన దాన్నుంచే ఎంతోకొంత ఖర్చుపెట్టాలి." (ఖుర్‌ఆన్–65:7)

"ఒక ముస్లిం పుణ్యఫలాపేక్షతో తన భార్యాపిల్లల కోసం ఖర్చు పెడ్తుంటే అదంతా అతని పాలిట దానం (సదఖా) చేసే పుణ్యంతో సమానమవుతుంది." (బుఖారి)

"మీరు దైవప్రసన్నత కోసం ఏ పని చేసినా దాని పుణ్యఫలం మీకు తప్పకుండా లభిస్తుంది. చివరికి మీరు మీ భార్య నోటికి ఒక అన్నంముద్ద అందించినా దానికీ పుణ్యఫలం లభిస్తుంది." (బుఖారి, ముస్లిం)

"మనిషి ఒకరి అన్నపానీయాలకు బాధ్యుడై తన బాధ్యత) నిర్లక్ష్యం చేయటం చాలు, అతను పాపాత్ముడని చెప్పడానికి." (అబూదావూద్)

ఒకతను దైవప్రవక్త (స)ను "మామీద భార్యకున్న హక్కేమిటి?"ని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "నీవు తినగలిగే ఆహారం ఆమెకు పెట్టాలి. నీవు ధరించగలిగే వస్త్రాలు ఆమెకివ్వాలి. (నీపట్ల అవిధేయతకు పాల్పడినపుడు) నీవామె ముఖంపై కొట్టకూడదు. ఇంట్లో తప్ప మరెక్కడా ఆమెను వదలి పెట్టకూడదు" అని అన్నారు. (అబూదావూద్)

దైవప్రవక్త (స) ఒకసారి మంచి భర్తను గురించి చెబుతూ "తనభార్య కోసం ఉత్తముడైనవాడే మీలో ఉత్తముడు" అని అన్నారు. (ఇబ్నెమాజ)



భార్యావిధేయులైన భర్తలను గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "భార్యలకు విధేయులయ్యే భర్తలు నాశనమవుతారు." (ముస్తదరక్ హాకమ్)

దైవప్రవక్త (స)"దేవుని దాసీలను కొట్టకండని హితబోధ చేశారు. ఆయనీ హితోపదేశం చేసిన కొంతకాలానికి ఉమర్ (రజి) ఆయన దగ్గరికి వచ్చి "స్త్రీలు తమ భర్తలకు ఎదురుతిరుగుతున్నారని ఫిర్యాదు చేశారు. అప్పుడు దైవప్రవక్త (స) భార్యల్ని కొట్టేందుకు అనుమతిచ్చారు. (ఆ తర్వాత కొంత కాలానికి) ఎంతోమంది స్త్రీలు దైవప్రవక్త (స) భార్యల దగ్గరికి వచ్చి తమ భర్తలు తమల్ని కొడుతున్నారని ఫిర్యాదు చేయసాగారు. అప్పుడు దైవప్రవక్త (స) ప్రజలతో "చాలామంది స్త్రీలు ముహమ్మద్ ఇంటి దగ్గర గుమిగూడి తమ భర్తల్ని గురించి ఫిర్యాదు చేస్తున్నారు. మీలో తమ భార్యల్ని వేధించేవారు మంచివారు కాదు, జాగ్రత్త!" అన్నారు. (అబూదావూద్)

"వారిపట్ల మంచితనం కలిగివుంటూ సంసారం చేయండి. ఒకవేళ వారు మీకు (ఒక విషయంలో) నచ్చకపోతే, నచ్చని విషయంలోనే దేవుడు మీకు ఎంతో శ్రేయస్సు, మేలు పెట్టి ఉండవచ్చు." (ఖుర్‌ఆన్–4:19)

"స్త్రీ ప్రక్కటెముకతో సృజించబడింది. అది ఏ విధంగానూ తిన్నగా కాదు. కనుక నీవు ఆమె నుండి ప్రయోజనం పొందాలనుకుంటే వంకరగా ఉన్నప్పుడు కూడా ప్రయోజనం పొందగలవు. నీవామెను తిన్నగా చేయటానికి ప్రయత్నిస్తే ఆమెను విరగ్గొడతావు. ఆమెను విరవటమంటే విడాకులివ్వటమే." (ముస్లిం)

"మీలో ప్రతి మనిషీ బాధ్యతాయుతుడైన సంరక్షకుడే. కనుక అతను తన సంరక్షణలో ఉండేవారిని గురించి ప్రశ్నించబడతాడు. పాలకుడు పాలిత ప్రజల సంరక్షకుడు. అతను తన ప్రజల విషయంలో బాధ్యుడవుతాడు. పురుషుడు తన భార్యాపిల్లలకు సంరక్షకుడు. అతను వారి విషయంలో బాధ్యుడవుతాడు. స్త్రీ తన భర్త ఇంటికి, అతని పిల్లలకు సంరక్షకురాలు. ఆమె వారి విషయంలో బాధ్యురాలవుతుంది." (బుఖారి)

## 8. భర్త హక్కులు

"దేవుడు స్త్రీలపై పురుషులకు కొంత ఆధిక్యత ప్రసాదించడం వల్ల, పురుషులు తమ సంపద స్త్రీలకోసం ఖర్చుపెడ్తున్నందువల్ల పురుషులు స్త్రీలపై వ్యవహారకర్తలు అవుతారు. కనుక సుగుణవతులైన స్త్రీలు తమ భర్తలకు విధేయతచూపుతూ వారి కనుసన్నలలో నడచుకుంటారు." (ఖుర్ఆన్–4:34)

"స్త్రీ తనభర్త ఇంట్లో అతని అనుమతి లేకుండా ఏ వస్తువూ దానం చేయ కూడదు. ఒకవేళ ఆమె అలా అనుమతి లేకుండా దానం చేస్తే పుణ్యఫలం భర్తకు పోతుంది, ఆమెకు పాపం మిగులుతుంది." (బుఖారి)

"భర్త అనుమతి లేనిదే భార్య అతని ఇంటి నుండి బయలుదేరకూడదు." (భర్త వద్దన్నా అతని ఆజ్ఞను ధిక్కరించి బయటికి పోకూడదు.)– (మిష్కాత్)

"భర్త ఇంట్లో ఉన్నప్పుడు అతని అనుమతి లేకుండా రమజాన్ ఉపవాసాలు తప్ప ఆమె ఇతర ఐచ్ఛిక (నఫిల్) ఉపవాసాలు పాటించకూడదు." (ముస్లిం)

"ఒక స్త్రీ దగ్గర (హజ్‌యాత్ర చేయగలిగినంత) ధనం ఉన్నప్పటికీ ఆమె భర్త హజ్‌యాత్ర జరిపే అనుమతి ఇవ్వకపోతే, అతని అనుమతి లేకుండా ఆమె హజ్‌యాత్ర జరపలేదు." (దారుల్ ఖుత్నీ)

"మహిళల్లారా! మేలు చేసినవారికి మీరు ఎల్లప్పుడూ కృతజ్ఞులయి ఉండండి. మీలో ఎవరైనా ఒకరు తమ తల్లిదండ్రుల దగ్గర కాలం గడుపుతూ ఉంటారు. తరువాత దేవుడు ఆమెకు భర్తను అనుగ్రహిస్తాడు. ఆ తరువాత ఆమెకు సంతానభాగ్యం కూడా కలిగిస్తాడు. కాని ఎప్పుడయినా భర్తతో ఏదైనా చిన్న గొడవ వస్తే చాలు, 'నీ వల్ల నేనెప్పుడు సుఖపడ్డానని' అంటారు స్త్రీలు (లోగడ చేసిన మేళ్ళన్నీ మరచిపోయి)." (బుఖారి)

"రెండు రకాల మనుషులు ఉన్నారు. వారు చేసే నమాజులు వారి శిరస్సుల ఎత్తుకు మించి పైకి పోలేవు. ఒకటి, తన యజమానిని వదలి పారిపోయి



తిరిగిరాని బానిస చేసే నమాజు. రెండు, తన భర్త ఆజ్ఞలను ధిక్కరించి ఇక ఎన్నటికీ దారికిరాని భార్య చేసే నమాజ్." (హదీసు)

"నేనెవరికైనా ఇతరులకు సజ్దా చేయమని ఆజ్ఞాపించి నట్లయితే తన భర్త ముందు సజ్దా చేయమని స్త్రీకి ఆదేశించి ఉండేవాణ్ణి" (తిర్మిజీ)

"నా ప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షిగా చెబుతు న్నాను. ఏ స్త్రీ అయినా తన భర్త హక్కుల్ని నెరవేర్చనంత వరకు ఆమె తన ప్రభువు (దేవుని) హక్కుల్ని కూడా నెరవేర్చనట్టే." (హదీసు); "భర్త హక్కుల్ని నెరవేర్చనంతవరకు ఏస్త్రీ విశ్వాసమాధుర్యం ఆస్వాదించలేదు." (మిష్కాత్)

"స్త్రీ తనభర్త పడక వదలి అతనినుండి వేరయి రాత్రిగడిపితే, ఆమె అతని దగ్గరకు తిరిగిరానంతవరకూ దైవదూతలు ఆమెను శపిస్తుంటారు." (బుఖారి)

"భర్త తన పట్ల ప్రసన్నుడిగా ఉన్న స్థితిలో మరణించే స్త్రీ స్వర్గానికి పోతుంది." (తిర్మిజి)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: నేను "దైవప్రవక్తా! స్త్రీ మీద అందరికంటే ఎక్కువ హక్కు ఎవరికుంది?" అని అడిగాను. దానికాయన "ఆమె భర్తకు ఉంది" అన్నారు. మళ్ళీ నేను "పురుషుని మీద అందరికంటే ఎక్కువ హక్కు ఎవరికుంది?" అని ప్రశ్నించాను. ఆయన "అతని తల్లికి ఉంది" అని చెప్పారు. (ముస్తద్‌రక్ హాకిమ్)

"మీరు (ప్రయాణం నుంచి) తిరిగొస్తే, వచ్చేముందు మీరాక గురించి కబురు పంపండి. దాని వల్ల మీ భార్యలు అలంకరించుకొని మీ కోసం ఎదురుచూడటానికి సిద్ధంగా ఉంటారు." (ముస్లిం)

"స్త్రీ (రోజూ) అయిదు వేళలా నమాజ్ చేస్తూ, రమజాన్‌నెల ఉపవాసాలు పాటిస్తూ, తన శీలాన్ని కాపాడుకుంటూ భర్త పట్ల వినయంతో మసలు కుంటూవుంటే ఆమె పరలోకాన స్వర్గద్వారాల్లో తనకు నచ్చిన ద్వారం గుండా ప్రవేశించవచ్చు." (మిష్కాత్) ✪



## 9. బంధువుల హక్కులు

*సామాజిక వ్యవస్థలో బంధువులతో సత్సంబంధాలు ఎంతో ముఖ్యమైన విషయం. రక్త సంబంధీకులతో, సన్నిహిత బంధువులతోనే సంబంధాలు విచ్ఛిన్నం చేసుకునే మనిషి సమాజంలోని ఇతర మానవుల పట్ల చిత్తశుద్ధితో సత్సంబంధాలు కలిగివుంటాడని ఆశించలేము.*

"రక్త సంబంధీకులతో మీకేర్పడివున్న సహజ బాంధవ్యాన్ని తెంచకండి. దేవుడు మీ చర్యల్ని ఓకంట గమనిస్తున్నాడన్న సంగతి మరచిపోకండి." (ఖుర్ఆన్–4:1)

*మనిషి అంతర్యంలో నిజమైన బంధుప్రేమ ఉంటేనే బంధువులతో సత్సంబంధాలు కలిగివుంటాడు. ఇలాంటి బంధుప్రేమను ఇస్లాంలో "సిలారహ్మి" అంటారు. బంధుత్వాన్ని విచ్ఛిన్నం చేసుకోవడం, ఆస్తి అంతస్తులు చూసుకొని మిడిసిపడుతూ పేదబంధువులకు దూరంగా మసలు కోవడం, వారి హక్కులు కాలరాయడం బంధుప్రేమ అన్పించుకోదు.*

దేవుడు సమస్త సృష్టిరాసుల్ని సృజించిన తర్వాత 'బంధుప్రేమ' లేచి నిలబడి "(దేవా!) నేను బంధుత్వాల తెగతెంపుల బారి నుండి నీ శరణు కోరుతున్నాను" అన్నది. దేవుడు దాని మాట విని "అయితే నీ పట్ల సత్సంబంధాలు కలిగివుండే వాడిపట్ల నేనూ సత్సంబంధాలు కలిగి వుంటాను. నీతో సంబంధాలు తెగతెంపులు చేసుకునేవాడితో నేనూ సంబంధాలు తెగతెంపులు చేసుకుంటాను. ఇది నీకిష్టమేనా?" అని అన్నాడు. దానికి బంధుప్రేమ "ఇష్టమే ప్రభూ!" అన్నది. అప్పుడు దేవుడు "సరే ఆ భాగ్యం నీకు దక్కుతుంది" అని చెప్పాడు.

బంధుత్వం దైవసింహాసనానికి వ్రేలాడబడి "నాతో సత్సంబంధాలు కలిగివున్న వాడితో దేవుడు కూడా సత్సంబంధాలు కలిగివుండుగాక! నన్ను విచ్ఛిన్నం చేసినవాడిని దేవుడు కూడా విచ్ఛిన్నం చేయుగాక!" అని ప్రార్థిస్తూ ఉంటుంది. (బుఖారి, ముస్లిం)



"బంధుత్వాన్ని త్రెంచివేసేవాడు స్వర్గంలో ప్రవేశించలేడు." (బుఖారి)

ఒకతను దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "నన్ను నరకం నుండి దూరం చేసి, స్వర్గానికి గొనిపోయే ఆచరణ గురించి నాకు తెలియజేయండి" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) ఇలా చెప్పారు– "అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించు. ఆయనకు మరెవరినీ సాటి కల్పించకు. నమాజ్ వ్యవస్థ నెలగొల్పు. (పేదల ఆర్థిక హక్కయిన) జకాత్ చెల్లిస్తూఉండు. బంధువులతో సత్సంబంధాలు కలిగివుండు." (బుఖారి, ముస్లిం)

"ఎవరైనా తన ఉపాధిలో సమృద్ధి, ఆయుష్షులో పెరుగుదల కోరుకుంటే అతను తన బంధువులపట్ల సత్ప్రవర్తన కలిగివుండాలి" (బుఖారి, ముస్లిం)

"ఒక బంధువు ఉపకారం చేస్తే దానికి ప్రత్యుపకారం చేసేవాడు (నిజమైన) బంధుప్రియుడు కాడు. బంధువులు తనతో సంబంధాలు తెగతెంపులు చేసుకున్నప్పటికీ వారితో సత్సంబంధాలు కొనసాగించేవాడే (నిజమైన) బంధుప్రియుడు." (బుఖారి)

ఒకతను వచ్చి "దైవప్రవక్తా! నా బంధువులు కొందరున్నారు. నేను వారితో సత్సంబంధాలు కొనసాగించాలని ఎంత ప్రయత్నిస్తున్నా వారు మాత్రం నాతో సంబంధాలు తెగతెంపులు చేసుకోవాలనే చూస్తున్నారు. నేను వారిపట్ల మంచిగా వ్యవహరిస్తుంటే వారు నాకు కీడు తలపెడ్తున్నారు. నేను వారిపట్ల మృదువైఖరి అనుసరిస్తుంటే వారు నాపట్ల కఠినంగా ప్రవర్తిస్తు న్నారు" అంటూ తన గోడు వెళ్ళబుచ్చున్నాడు. దైవప్రవక్త (స) అతని మాటలు విని "నువ్వు చెప్పింది నిజమేఅయితే నువ్వు వారి నోళ్ళలో వేడి బూడిద పోస్తున్నావనుకో. నువ్వు వారిపట్ల ఇలాగే సత్ప్రవర్తనతో మెలుగు తున్నంత కాలం దేవుని తరఫున వారికి వ్యతిరేకంగా ఒక సహాయకుడు నీవెంట ఉంటాడు" అని అన్నారు. (ముస్లిం)

## 10. మానవ హక్కులు

“దేవుడు తన గ్రంథంలో ‘మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీ పురుష జంట నుండి పుట్టించాము. తరువాత మీ పరస్పర పరిచయం కోసం మిమ్మల్ని విభిన్న జాతులుగా, తెగలుగా చేశాం. అయితే మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు.(49:13)’ అని అన్నాడు. కనుక అరబ్బీయుడిపై అరబ్బేతరునికి, అరబ్బేతరునిపై అరబ్బీయుడికి; తెల్లవాడిపై నల్లవాడికి, నల్లవాడిపై తెల్లవాడికి ఎలాంటిఆధిక్యత లేదు. ఆధిక్యతకు గీటురాయి దేవుని పట్ల భయభక్తులు ఉండటమే.”

“ప్రజలారా! మీప్రభువు ఒక్కడే. తండ్రి కూడా ఒక్కడే. మీరంతా ఆదం (అలై) సంతానం. ఆదం మట్టితో సృజించబడ్డాడు. మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో అందరికంటే ఉత్తముడు. కనుక ఆధిక్యతా ఔన్నత్యాలకు సంబంధించిన యావత్తు ప్రగల్భాలు, ధనప్రాణాల ప్రతీకారాలకు సంబంధించిన మొత్తం డిమాండ్లు ఇప్పుడు నాకాళ్ళ కింద తొక్కివేయబడ్డాయి. (అంటే నిషేధించబడ్డాయి.) కాబా సంరక్షణ బాధ్యత, హజ్‌యాత్రికులకు నీటిసరఫరా సేవలు మాత్రం యథాతథంగా కొనసాగుతాయి.” (హజ్‌వీడ్కోలు ప్రసంగం-పాక్షికం: ముస్లిం)

“ఎవరైనా ప్రతీకార హత్య(శిక్ష)గా లేక ధరణిపై కల్లోలం రేకెత్తించి నందుకు శిక్షగా తప్ప ఏ మనిషినైనా చంపితే అతను యావత్తు మానవాళిని చంపినట్లే. అలాగే ఎవరైనా ఒక మనిషి ప్రాణం కాపాడితే అతను యావత్తు మానవాళిని కాపాడినట్లే.” (ఖుర్‌ఆన్–5:32)

“ముస్లిం ఎవరైనా జిమ్మీకు చెందిన సారాయిని, పందిని సైతం నష్టపరచినా దానికీ ఆ ముస్లిం నష్టపరిహారం ఇచ్చుకోవాల్సిందే.”– “నోటితో లేక కాలితో బాధించడం, కొట్టడం, తిట్టడం, పరోక్షనిందకు పాల్పడటం



ముస్లిం విషయంలో ఎలా నిషిద్ధమో ముస్లిమేతరుని విషయంలోనూ నిషిద్ధమే.” (దుర్రెముఖ్తార్)

“ఏ ముస్లిమైనా ఒడంబడికదారునిపై దౌర్జన్యంచేస్తే లేదా అతని హక్కులు తగ్గిస్తే లేదా అతనిపై శక్తికిమించిన బరువుమోపితే లేదా అతని వస్తువేదైనా అతని అభీష్టానికి వ్యతిరేకంగా తీసుకుంటే ప్రళయదినాన నేనా ముస్లింకు వ్యతిరేకంగా వకీలునై (దేవుని ముందు) వాదిస్తాను.” (అబూదావూద్)

“ఏ ముస్లిం అయినా ఒడంబడికదారుడ్ని (అంటే ముస్లిమేతరుడ్ని) చంపడం జరిగితే అతను స్వర్గసువాసన ఆఘ్రాణించే అదృష్టానికి కూడా నోచుకోలేడు. స్వర్గసువాసన నలభై ఏండ్లు ప్రయాణం చేసినంత దూరం దాకా వ్యాపిస్తుంది.” (అల్‌జిహాద్ ఫిల్‌ఇస్లాం)

ప్రళయదినాన దేవుడు, “నా ఔన్నత్యం ప్రాతిపదికపై పరస్పరం అభిమానించుకున్నవారు ఎక్కడున్నారు? నా (కారుణ్య)ఛాయ తప్ప మరే ఛాయా లభించని ఈరోజు నేను వారికి నా నీడపట్టున ఆశ్రయం కల్పిస్తాను” అని అంటాడు. (ముస్లిం)

“ఒకతను కొందరిని అభిమానిస్తున్నాడు. కాని సత్కార్యాలు చేయడంలో అతను వారి స్థాయికి చేరుకోలేకపోతున్నాడు (దీనిపై మీ అభిప్రాయం)?” అని దైవప్రవక్త (స)ను ఎవరో అడిగాడు. దానికాయన “మనిషి తాను అభిమానించిన వారితోపాటే ఉంటాడు” అన్నారు. (బుఖారీ)

“ఎవరైనా రోగిని పరామర్శించడానికి లేదా దేవుని కోసం తన సోదరుణ్ణి కలుసుకోవడానికి వెళ్ళినప్పుడు (దేవుని తరపున) ఒక ప్రకటనకర్త “నీకు అభినందనలు. నీ నడక సార్థకమవుగాక! నీకు స్వర్గంలో స్థానం లభించుగాక!” అని ఎలుగెత్తి ప్రార్థిస్తాడు. (తిర్మిజీ)

“ఏ యువకుడైనా ఒక వృద్ధుడ్ని అతని వృద్ధాప్యం చూసి గౌరవిస్తే దేవుడు అతని వృద్ధాప్యంలో అతడ్ని గౌరవించేవారిని పుట్టిస్తాడు.” (తిర్మిజీ) ❁



## 11. దేవుని హక్కులు

హజ్రత్ ముఆజ్ (రజి) కథనం: నేనొక సారి దైవప్రవక్త (స) వెనుక అఫీర్ అనే గాడిదపై ప్రయాణం చేస్తున్నాను. (దారిలో) ఆయన “ముఆజ్! దాసులపై దేవుని హక్కే మిటో, దేవునిపై దాసుల హక్కేమిటో నీకు తెలుసా?” అనడిగారు. నేను “దేవునికి, దైవప్రవక్తకే బాగా తెలుసు” అన్నాను. అప్పుడాయన “దాసులపై దేవునికున్న హక్కు– వారు దేవుడ్ని మాత్రమే ఆరాధించాలి. ఆయనకు మరెవరినీ సాటి కల్పించకూడదు. దేవునిపై దాసులకున్న హక్కు– ఆయన తనకు సాటి కల్పించనివారిని శిక్షించకపోవడమే” అని అన్నారు. “అయితే దైవప్రవక్తా! నేనీ శుభవార్తను ప్రజలకు తెలియజేయనా?” అని అడిగాను. దానికి ఆయన “వద్దు. (అప్పుడే) ఈ శుభవార్తను ప్రజలకు తెలియజేయకు. అలా చెబితే వారు దీని మీదే ఆధారపడతారు” అని హెచ్చరించారు. (బుఖారి, ముస్లిం)

“దేవునికి సాటి కల్పించేవారికి దేవుడు స్వర్గప్రవేశం నిషేధించాడు. వారి నివాసం నరకమవుతుంది. అలాంటి దుర్మార్గులకు ఎవరూ సహాయం చేయలేరు.” (ఖుర్‌ఆన్–5:72)

“దేవుడు ఒక ఉదాహరణ ఇస్తున్నాడు, (వినండి): ఒక మనిషి ఉన్నాడు. అతనికి వక్ర మనస్కులయిన అనేకమంది యజమానులు ఉన్నారు. వారిలో ప్రతి ఒక్కడూ అతడ్ని తన వైపు లాగుతుంటాడు. దీనికి భిన్నంగా మరొక వ్యక్తి ఉన్నాడు. అతను పూర్తిగా ఒకే యజమానికి బానిసగా ఉన్నాడు. మరి వీరిద్దరి పరిస్థితి ఒకటేనా? (కాదు.) సకల స్తోత్రాలకు దేవుడే అర్హుడు. కాని చాలామంది అజ్ఞానాంధకారంలో పడిఉన్నారు.” (ఖుర్‌ఆన్–39:29)

“అసత్యాలు, అభూత కల్పనలు మానేయండి. పూర్తిగా ఏకోన్ముఖులై అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించండి. ఆయనకు ఎవరినీ సాటి కల్పించకండి. దేవునికి సాటికల్పించినవాడు ఆకాశంనుండి అమాంతం అథఃపాతాళంలోకి



పడిపోయినట్లే. ఇక అతడ్ని పక్షులయినా పొడుచుకొని తింటాయి; లేదా గాలిఅయినా ఎత్తి దూరంగా విసరి పడవేస్తుంది.” (ఖుర్‌ఆన్–22:30,31)

*దేవునికి ఇతరుల్ని సహవర్తులుగా చేయడం, ఆయన గుణగణాల్లో, శక్తి సామర్థ్యాలలో, అధికారాల్లో, హక్కుల్లో ఆయన దాసులకు భాగస్వామ్యం కల్పించడం వగైరా విషయాలు అసత్యాలు, అభూతకల్పనల క్రిందికే వస్తాయి. ఏ విషయంలోనైనా దేవుని ఆజ్ఞలకు, ఆయనప్రవక్త బోధనలకు వ్యతిరేకంగా ఇది ధర్మం, అది అధర్మమని నిర్ణయించడం, దాన్ని ఆచరించడం కూడా అసత్యం క్రిందికే వస్తాయి.*

“ప్రజలందరిలో శక్తిమంతుడు కాదలచుకున్నవాడు దేవుడ్నే నమ్ముకొని ఆయన మీద భారం వేయాలి. అందరికంటే గొప్ప స్థితిపరుడు కాదలచుకున్నవాడు తన దగ్గరున్న దానికంటే దేవుని దగ్గర (స్వర్గంలో) ఉన్నదానిపై ఎక్కువ నమ్మకం పెట్టుకోవాలి. అందరికంటే ఎక్కువ గౌరవనీయుడు కాదలచుకున్నవాడు అత్యంత గౌరవనీయుడు, మహోన్నతుడైన దేవునికి భయపడుతుండాలి.” (ఇబ్నెఅబ్బాస్)


**కాబా సందేశం**




✻.ఏకదైవారాధన, ✻.షిర్క్ చేసేవారికి సిఫారసు లేదు, ✻.అంధానుకరణ, ✻.ఇబ్రాహీం(అలైహి) మిషన్, ✻.త్యాగం, ✻.బలిదానం, ✻.జమ్‌జమ్ పుట్టుపూర్వోత్తరాలు, ✻.ధర్మప్రచారం, ✻.హజ్ సన్నాహాలు, ✻.శుభసమాధి సందర్శన, ✻.హజ్–ఉమ్రా విధానాలు, ✻.హజ్ అనుభవాలు, ✻.అంతర్జాతీయ సమానత్వం, ✻.చారిత్రక చిహ్నాల పర్యటన, ✻.సంబంధిత ఫొటోలు వగైరా విశేషాలతో కూడిన పుస్తకం.

రచన: అబుల్ ఇర్ఫాన్, (పే:224, వెల: రూ100/–)

**ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్–2, ✆ 9441515414**

“మీరు దేవునిపై ఏవిధంగా నమ్మకం కలిగివుండాలో ఆవిధంగా నమ్మకం కలిగివుంటే ఆయన పక్షులకు ఆహారం ప్రసాదించినట్లే మీక్కూడా ఉపాధి ప్రసాదిస్తాడు. పక్షులు ఉదయం ఆకలితో బయలుదేరి సాయంత్రానికి కడుపు నింపుకొని వస్తాయి.” (తిర్మిజీ)

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: నేనొక రోజు వాహనంపై దైవప్రవక్త (స) వెనుక కూర్చున్నాను. ఆయన నాతో మాట్లాడుతూ “అబ్బాయ్! నేను నీకు కొన్ని విషయాలు ఉపదేశిస్తున్నాను. నీవు దేవుని ధర్మాన్ని కాపాడుతూ వుండు, దేవుడు నిన్ను కాపాడుతుంటాడు. దేవునిధర్మాన్ని రక్షించు, అప్పుడు నీవు ఆయన్ని నీముందు చూస్తావు. నీవు వేడుకోవాలనుకుంటే దేవుడ్ని మాత్రమే వేడుకో. సహాయం అర్థిస్తే దేవుడ్నే సహాయం అర్థించు. గుర్తుంచుకో, ఒక జాతి ప్రజలంతా కలసి నీకేదైనా మేలు చేయాలని నిర్ణయించుకున్నా దేవుడు నీకు రాసిపెట్టింది తప్ప ఎలాంటి మేలు చేయలేరు. అలాగే ప్రజలంతా కలసి నీకేదైనా కీడు తలపెట్టదలచుకుంటే, నీకోసం దేవుడు నిర్ణయించింది తప్ప ఎలాంటి కీడు తలపెట్టలేరు.” (మిష్కాత్)

“మీలో ప్రతిఒక్కరూ దేవునిపట్ల సదభిప్రాయం కలిగివున్న స్థితిలోనే చనిపోవాలి సుమా!”– “దేవునివద్ద ఎలాంటి శిక్ష వుందో తెలిస్తే విశ్వాసి తనకు స్వర్గం లభిస్తుందని ఎన్నటికీ అనుకోడు. అలాగే దేవునికున్న కారుణ్యం గురించి తెలిస్తే అవిశ్వాసి ఎన్నటికీ స్వర్గంపట్ల నిరాశచెందడు.” (ముస్లిం)

“(మానవ జీవితానికి) మార్గం నిర్దేశించవలసిన బాధ్యత మాపైనే ఉంది. ఇహలోకం మాదే; పరలోకమూ మాదే. కనుక నేను మిమ్మల్ని ప్రజ్వరిల్లే అగ్ని గురించి హెచ్చరిస్తున్నాను. సత్యాన్ని నిరాకరించి ముఖం తిప్పుకునే దౌర్భాగ్యుడు తప్ప మరెవరూ అందులో పడిపోరు.” (ఖురాన్:92:12–17)

“గుర్తుంచుకోండి! దైవస్మరణ వల్లనే మానవులకు మనశ్శాంతి లభిస్తుంది.” (ఖుర్ఆన్–13:28)



# 12. ముస్లింల పరస్పర సంబంధాలు

“విశ్వాసులు పరస్పరం అన్నదమ్ముల్లాంటివారు. కనుక మీ అన్నదమ్ముల మధ్య సత్సంబంధాలు నెలకొల్పండి. దేవునికి భయపడండి, మీరు కరుణించ బడతారు.”(ఖుర్ఆన్–49:10)

“వారు విశ్వాసుల పట్ల మృదువుగా, అవిశ్వాసుల పట్ల కఠినంగా ప్రవర్తిస్తారు.” (ఖుర్ఆన్–5:54)

“పరస్పరం పగబట్టకండి. అసూయ చెందకండి. ఎడమొహం పెడమొహంతో ఉండకండి. సంబంధాలు త్రెంచుకోకండి. దైవదాసులారా! పరస్పరం అన్నదమ్ములుగా ఉండండి. ఒకముస్లిం తోటి(ముస్లిం) సోదరునితో మూడు రోజులకు మించి మాట్లాడకుండా ఉండరాదు.” (బుఖారీ, ముస్లిం)

“ఒక ముస్లిం తన సాటి ముస్లిం సోదరుడ్ని అవిశ్వాసి (కాఫిర్) అని పిలిస్తే వారిద్దరిలో ఒకడు తప్పకుండా అవిశ్వాసి అయిపోతాడు.” (బుఖారి)

“ముస్లిం తోటిముస్లింని దూషించడం దుర్మార్గం. అతనితో యుద్ధం చేయడం అవిశ్వాసం (కుఫ్ర్)తో సమానం.” (బుఖారి)

“నీవు నీ(ముస్లిం) సోదరుని కష్టాలపట్ల సంతోషించకు. అలా చేశావంటే దేవుడు అతడ్ని కనికరించి నిన్ను కష్టాలపాలు చేస్తాడు.” (మిష్కాత్)

“ఒక మనిషి తన తోటిముస్లిం సోదరుణ్ణి చులకనగా చూడటం చాలు అతను చెడ్డవాడని చెప్పటానికి. ఒక ముస్లింకు తోటి ముస్లిం ధనమాన ప్రాణాలు నిషిద్ధం. (అంటే తోటిముస్లిం ధనమానప్రాణాలకు నష్టం కల్గించ కూడదు.) దేవుడు మీ శరీరాలను, ముఖాలను చూడడు. ఆయన మీ అంతరాత్మల్ని, ఆచరణల్ని మాత్రమే చూస్తాడు.” (బుఖారి, ముస్లిం)

“ఒకరి మీద ఒకరు అసూయ చెందకండి. పగ పెంచుకోండి. కూపీలు తీయకండి. ఇతరుల తప్పులు ఎత్తిచూపకండి. ఇతరుల్ని మోసగించే ఉద్దేశ్యం



తో బేరం మీద బేరం చేయకండి. దైవదాసులారా! పరస్పరం అన్నదమ్ముల్లా జీవించండి. (బుఖారి, ముస్లిం)

“ఒక ముస్లిం మరొక ముస్లింకు అద్దం లాంటివాడు. ఒక ముస్లిం మరొకముస్లింకు సోదరుడు. అతను తన ముస్లింసోదరుడ్ని వినాశం నుండి రక్షిస్తాడు. అతనికి (సదా) మద్దతునిస్తూ కాపాడుతుంటాడు.” (బుఖారీ)

“మీరు ముగ్గురు ఉన్నప్పుడు మూడోవాడ్ని వదలి మిగతా ఇద్దరు రహస్యాలు మాట్లాడుకోకండి. ఈ వైఖరివల్ల ఆ మూడో వ్యక్తికి బాధ కలగవచ్చు. అయితే మీరు మరికొందరితో కలిసిపోతే అప్పుడు ఫర్వాలేదు.” (బుఖారీ, ముస్లిం)

“సోమ, గురు వారాల్లో స్వర్గద్వారాలు తెరువబడతాయి. ఆరోజు అల్లాహ్ దైవత్వంలో ఇతరులకు సాటి కల్పించని ప్రతిఒక్కరి పాపాలు మన్నించబడతాయి. కాని తనకూ తన (ముస్లిం)సోదరునికి మధ్య శత్రుత్వం ఉన్నవాడి పాపాలు మన్నించబడవు. వారి గురించి “వీరిద్దరూ తమ సంబంధాలు మెరుగుపరచుకునేదాకా గడువు ఇవ్వండి! వీరిద్దరూ తమ సంబంధాలు మెరుగుపరచుకునేదాకా గడువు ఇవ్వండి” అని అనటం జరుగుతుంది. (ముస్లిం)

“నీవు నీ ముస్లింసోదరుడ్ని కలుసుకుంటే అతనికి సలాం చెయ్యి. అతను విందుకు ఆహ్వానిస్తే దాన్ని స్వీకరించు. అతను నీద్వారా ఏదైనా సహాయం కోరితే సహాయం చెయ్యి. అతను తుమ్మి ‘అల్‌హమ్దులిల్లాహ్’ (సకల ప్రశంసలకు దేవుడే అర్హుడు) అనంటే, నీవు ‘యర్‌రహ్మకుల్లాహ్’ (దేవుడు నిన్ను కరుణించుగాక) అని బదులుపలుకు. అతడు వ్యాధిగ్రస్తుడయితే వెళ్ళి పరామర్శించు. చనిపోతే అతని శవానికి తోడుగా వెళ్ళు.” (ముస్లిం)

“నాప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుడి సాక్షి! తనకోసం ఇష్టపడిన దాన్నే తన (ముస్లిం)సోదరుని కోసం కూడా ఇష్టపడనంత వరకూ ఏవ్యక్తీ నిజమైన విశ్వాసి కాలేడు.” (బుఖారి, ముస్లిం)

“ఒక ముస్లిం తోటి ముస్లింకు సోదరుడు (లాంటివాడు). ఒక సోదరుడు తన సోదరునిపై (ఎన్నటికీ) దౌర్జన్యం చేయడు; అతడ్ని దౌర్జన్యపరునికి



అప్పగించడు కూడా. ఎవరు తన సోదరుని అవసరాలు తీర్చే పనుల్లో నిమగ్నుడై ఉంటాడో, దేవుడు అతని అవసరాలు తీర్చే బాధ్యత తీసుకుంటాడు. ఎవరు (తోటి)ముస్లింకు వచ్చిన కష్టాల్లో ఒక కష్టాన్ని దూరంచేస్తాడో ప్రళయదినాన దేవుడు అతని కష్టాలలో ఒక కష్టాన్ని దూరంచేస్తాడు. మరెవరు (తోటి)ముస్లిం పొరపాట్లు కప్పిపుచ్చుతాడో, ప్రళయదినాన దేవుడు అతని పొరపాట్లు (పాపాలు) కప్పిపుచ్చుతాడు.” (బుఖారి, ముస్లిం)

“విశ్వాసులు పరస్పరం అభిమానించుకోవడంలో, కనికరించుకోవడంలో, ప్రేమతో మెలగడంలో దేహం లాంటివారు. దేహంలో ఒక అవయవానికి బాధ కల్గినప్పుడు దేహమంతా బాధతో మూలుగుతుంది. (బుఖారీ)

“కేవలం నోటితో ఇస్లాం స్వీకరించిన ప్రజలారా! మీ హృదయాల్లో విశ్వాసం ఇంకా చోటుచేసుకో లేదు. మీరు (తోటి)ముస్లింలను బాధించకండి. వారిని కించపరచకండి. వారి తప్పుల వెంట పడకండి. ఎవరు తమ తోటిముస్లింల తప్పుల వెంటపడతారో దేవుడు వారి తప్పుల వెంటపడతాడు. దేవుడు ఏ మనిషి తప్పుల వెంటపడతాడో ఇంట్లో కూర్చున్నా సరే అతడ్ని పరాభవం పాల్జేసిగాని వదలిపెట్టడు.” (తిర్మిజి)


**IRC ప్రచురణల ప్రత్యేకత**

❶ తేట తెలుగులో భావస్పష్టీకరణ

❷ సులభ శైలిలో సాహిత్య మాధుర్యం

❸ సంక్షిప్త వాక్యాల్లో సమగ్ర సమాచారం

❹ అత్యాధునికమైన కూర్పుతో కూడిన పని

❺ పుష్కర గ్రంథాల్లో ఇస్లాం సంపూర్ణస్వరూపం

# 13. సమైక్యతే అసలైన శక్తి

“మీరంతా కలసి దైవత్రాటిని (దైవధర్మాన్ని) దృఢంగా పట్టుకోండి. విభేదాలలో పడిచీలిపోకండి. దేవుడు చేసిన మేళ్ళను జ్ఞాపకం చేసుకోండి.” (3:103)

“మీరు పరస్పరం కలహించుకోకండి. అలాచేస్తే మీలో పిరికితనం, బలహీనతలు చోటుచేసుకుంటాయి; మీ ప్రాబల్యం పోతుంది.” (ఖుర్ఆన్–8:46)

“స్పష్టమైన సూచనలు, ప్రమాణాలు వచ్చినప్పటికీ పరస్పరం విభేదించుకొని విభిన్నవర్గాలుగా చీలిపోయినవారిలా మీరూ కాకండి. అలాంటి వారికి ఘోరమైన యాతనలు కాచుకొని ఉన్నాయి.” (ఖుర్ఆన్–3:105)

“అవిశ్వాసులు ఒకరికొకరు సమర్థించుకొని సహకరించుకుంటున్నారు. మీరు (విశ్వాసులై ఉండి కూడా) పరస్పరం సహకరించుకోకపోతే లోకంలో అరాచకం ఏర్పడి పెద్ద అల్లకల్లోలం చెలరేగుతుంది.” (ఖుర్ఆన్–8:73)

*ఒకప్పుడు విభిన్న వర్గాలుగా, తెగలుగా, కులాలుగా చీలిపోయి అనైక్యత, అంతఃకలహాలతో సతమతమవుతుండిన అరబ్బుల్ని ఇస్లాం సమైక్యపరచింది. కులం, గోత్రం, జాతి, ప్రాంతం, వర్ణం, వర్గం లాంటి కృత్రిమ విచక్షణ గోడలను కూలగొట్టి దేవుని ఏకత్వం, దైవప్రవక్త విధేయతల ప్రాతిపదికలపై వారందర్నీ ఒక గొడుగు క్రిందికి చేర్చింది. అందువల్ల ముస్లింలు ఇస్లాం సేవలో నిమగ్నులైఉండాలి. అదే వారి జీవన ధ్యేయం. ఈ ధ్యేయాన్ని విస్మరించి ధర్మంలో అంతగా ప్రాముఖ్యంలేని అత్యల్ప విషయాల్ని గురించి వాదించుకోవడంలో కాలం గడిపితే వారిలో సమైక్యత సన్నగిల్లి పోతుంది.*

“జాగ్రత్త! మీరు ముస్లిములై ఉండి కూడా నా తదనంతరం మెడలు నరుక్కునే అవిశ్వాసులుగా మారకండి.” (బుఖారి)

*ఒక పార్టీకి బయటి దాడులకన్నా అంతర్గత కలహాలే చాలా ప్రమాదకరమైనవి. బయటి నుంచి ఎన్ని సవాళ్ళు ఎదురైనా, అంతర్గతంగా పటిష్ఠంగా*



*ఉన్నప్పుడే ఆ పార్టీ విజయపథంలో పురోగమిస్తుంది. దీనికోసం పార్టీ కార్యకర్తలకు తమ పార్టీ నిబంధనావళిపై దృఢమైన విశ్వాసం, దాని లక్ష్యం పట్ల శ్రద్ధాసక్తులు, కార్యకర్తల్లో పరస్పర ప్రేమాభిమానాలు ఉండాలి.*

*దేవుడ్ని, ఆయన అంతిమప్రవక్త (స)ను విశ్వసించినవారి పార్టీ ‘ఇస్లాం.’ వారి పార్టీ నిబంధనావళి ‘ఖుర్ఆన్.’ దాని కార్యాచరణవిధానం ‘హదీస్.’ పార్టీ లక్ష్యం ‘ధర్మసంస్థాపనం’, తద్వారా దైవప్రసన్నత, పరలోకసాఫల్యం పొందడం. ఈ ఉన్నత లక్ష్యం కోసం పనిచేసేవారి భావాలు కూడా ఉన్నతంగా ఉండాలని, పార్టీలో అంతగా ప్రాముఖ్యంలేని అత్యల్ప విషయాలపై రేకెత్తే విభేదాలకు అతీతంగా వారు విశాలదృక్పథం అలవరచుకోవాలని ఇస్లాం బోధిస్తోంది. పార్టీ నిబంధనావళిని, దాని కార్యాచరణవిధానం, ఆశయాల్ని ఎంత గట్టిగా ప్రేమిస్తే అంతగా వారి మధ్య ప్రేమాభిమానాలు జనిస్తాయని చెబుతోంది.*

“మీలో ఒకవర్గం మంచి వైపునకు పిలిచేవారు, సత్కార్యాలు చేయమని ఆజ్ఞాపించేవారు, చెడు పనుల నుండి వారించేవారు తప్పకుండా ఉండాలి. అలాంటి వారే (ఇహపరలోకాల్లో) సాఫల్యం చెందేవారు.” (ఖుర్–3:104)

*ఈ సూక్తిని బట్టి ప్రతి ముస్లిం తన శక్తి సామర్థ్యాల మేరకు సమాజంలో ప్రబలివున్న చెడుగుల్ని అరికడ్తూ మంచిని వ్యాపింపజేస్తూ ప్రజలను సంస్కరించడానికి కృషి చేయాలని అర్థమవుతోంది.*

మీలో ఎవరయినా సమాజంలో ఏదయినా చెడ్డ పని చూసినప్పుడు దాన్ని అతను చేత్తో నిరోధిస్తే, దేవుని దగ్గర జవాబుదారీ బాధ్యత నుండి తప్పించుకుంటాడు. అంతటి శక్తి లేనివాడు చెడుకు వ్యతిరేకంగా గళం విప్పి అరికట్టేందుకు ప్రయత్నిస్తే అతను కూడా ఆ బాధ్యత నుండి తప్పించుకుంటాడు. చెడుకు వ్యతిరేకంగా గళంవిప్పి నిరోధించే శక్తి కూడా లేనివాడు కనీసం మనసులోనైనా ఆ చెడును ద్వేషిస్తే అతను కూడా జవాబుదారీ బాధ్యత నుండి తప్పించుకుంటాడు. ఈ (చివరి)వైఖరి అన్నిటికంటే అత్యల్ప స్థాయి విశ్వాసం (ఈమాన్) క్రిందికి వస్తుంది.” (నిసాయి) ✼



# 14. ఆరాధనా భావం

“నేను మానవుల్ని, జిన్నుల్ని (భూతాలను) నన్ను ఆరాధించడానికి (మాత్రమే) తప్ప మరే లక్ష్యంతో సృష్టించ లేదు.” (ఖుర్ఆన్–51:56)

*ఈ సూక్తిలో రెండర్థాలు ఉన్నాయి. ఒకటి, దేవుడ్ని తప్ప మరెవ్వరినీ ఆరాధించకూడదు. రెండు, దైవారాధన తప్ప మరే పనీ చేయకూడదు. మొదటి విషయం అందరికీ అర్థమవుతోంది. కాని రెండో విషయం నేడు అనేకమంది ముస్లింలకు సైతం అర్థం కావడం లేదు. కారణం వారి మనోమస్తిష్కాలలో “ఆరాధన” పదానికి పరిమిత భావం ఉండిపోవడమే.*

*ఇస్లాంలో ఆరాధన అనే పదానికి చాలా విస్తృత భావం ఉంది. నమాజ్, ఉపవాసం, కాబా యాత్ర, దైవధ్యానం లాంటి పూజాపురస్కారాలే కాదు; ఉపాధి సముపార్జన, కుటుంబ జీవనం, తోటి మానవులతో సంబంధాలు, వ్యాపారం, ఆర్థిక లావాదేవీలు, దేశపాలనా వ్యవహారాలు, యుద్ధం, స్నేహ ఒడంబడికలు, అంతర్జాతీయ సంబంధాలు సైతం ఆరాధన క్రిందికే వస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే మానవ జీవితంలోని సకల రంగాలకు చెందిన సమస్త వ్యవహారాలు దైవారాధనల క్రిందికే వస్తాయి. కాకపోతే ఇవన్నీ దేవుడు, ఆయన ప్రవక్త (స) అందజేసిన ఆదేశాల ప్రకారం నడుచుకున్నప్పుడే దైవారాధనలుగా పరిగణించబడతాయి.*

*ఆరాధనలోని ఈ విస్తృత భావం తెలుసుకుంటే మనిషి జీవితంలోని సమస్త వ్యవహారాల్లో ఎలాంటి అపమార్గం పట్టకుండా ఒక్క విశ్వప్రభువుని మాత్రమే ఆరాధించగలడు. అంటే మనిషి ఖుర్ఆన్, హదీసుల పరిధుల్లో మాత్రమే తన జీవిత వ్యవహారాలు సాగించాలన్నమాట.*

*ఒకే దేవుడ్ని ఆరాధిస్తున్నామని చెప్పుకునేవారు ఎన్ని నమాజులు చేసినా, ఎన్ని ఉపవాసాలు పాటిస్తున్నా. ఎంత ధ్యానం చేస్తున్నా– దైనందిన వ్యవహారాల్లో దైవేతరశక్తులకో లేక మనోవాంఛలకో దాస్యం చేస్తుంటే*



*మాత్రం ఆ మేరకు వారు దైవారాధన పరిధిని అతిక్రమిస్తున్నట్లే. అంటే ఆయా వ్యవహారాల్లో వారు దేవునికి సాటి కల్పిస్తున్నారన్నమాట. ఈవైఖరి దైవాగ్రహానికి గొనిపోతుంది.*

*కొందరు ఈ వైఖరి కప్పిపుచ్చుకోవడానికి లేక అజ్ఞానం వల్ల “ఇవి మత విషయాలు, అవి ప్రపంచ వ్యవహారాల”ని వాదిస్తారు. కాని ప్రపంచ వ్యవహారాలు కూడా దేవుని ఆజ్ఞలు, దైవప్రవక్త హితవుల వెలుగులోనే ఉండాలన్న యదార్థాన్ని వీరు గ్రహించకపోవడం ఎంతో విచారకరం.*

*ఇస్లాం ఏకేశ్వరవాదానికి సంబంధించి విశ్వాసానికి, ఆచరణకు మధ్య ఉన్న వైరుధ్యాన్ని ఖండించింది. యావత్ సృష్టిరాసులకు ఆరాధ్యుడు ఒక్కడేనని, ఆయన తప్ప వేరే ఆరాధ్యుడు పూజనీయుడు లేడని, ఆయనే ‘అల్లాహ్’ అని నమ్మడంతో పాటు ఆచరణరీత్యా కూడా ఆ ఒక్కడినే ఆరాధించాలని, ఆయన్నే వేడుకోవాలని, జీవితంలోని ప్రతి రంగంలోనూ ఆయన ఆజ్ఞల్ని మాత్రమే శిరసావహించాలని చెబుతోంది.*


**రమజాన్ ఆశయాలు**




✼.స్వాగత సన్నాహాలు, ✼.ఖుర్ఆన్ ఔన్నత్యం, ✼.ఐకమత్యానికి ఏకైక సూత్రం, ✼.విభేదాలతో విడిపోతే వినాశం తప్పదు, ✼.నమాజ్ ప్రాముఖ్యం –దాని విధానం, ✼.ఉజూ–గుసుల్, ✼. జికిర్–దుఆలు, ✼.నఫిల్ నమాజులు, ✼.దైవభీతి, ✼.దానధర్మాలు, ✼.ఉపవాసా(రోజా)ల ప్రాముఖ్యం, ✼.తరావీ నమాజ్, ✼.నఫిల్ రోజాలు, ✼.లైలతుల్ ఖద్ర్, ✼.ఫిత్రా దానం, వగైరా విశేషాలతో కూడిన ప్రత్యేక గ్రంథం ఇది.

రచన: అబుల్ ఇర్ఫాన్, పే:224, వెల: రూ100/-

**ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్–2, ✆ 944 1515 414**

# 15. ఇస్లాం మూలస్తంభాలు

"ఇస్లాం ఐదు మౌలిక అంశాలపై ఆధారపడి ఉంది. 1–అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడని; ముహమ్మద్ ఆ దేవుని దాసుడు, ప్రవక్త అని సాక్ష్య మివ్వాలి. 2–నమాజ్ వ్యవస్థ నెలగొల్పాలి. 3–(పేదల ఆర్థిక హక్కయిన) జకాత్ నెరవేర్చాలి. 4–కాబా సందర్శించి దానిప్రదక్షిణ (హజ్) చేయాలి. 5–రమజాన్ నెల ఉపవాసాలు పాటించాలి." (బుఖారి, ముస్లిం)

ప్రవక్త (స) హితోక్తి: "దేవుడు విశ్వాసంలేని సదాచరణను, సదాచరణలేని విశ్వాసాన్ని స్వీకరించడు." (ఇస్లామీ నజర్యా–ప్రొఫెసర్ ఖుర్షీద్ అహ్మద్)

చెట్టు మొలకెత్తి పెరగడానికి విత్తనం ఎంత ముఖ్యమో ఆచరణకు విశ్వాసం కూడా అంతే ముఖ్యం. విద్యుచ్ఛక్తి గురించి ఏమీ తెలియని బాలుడు ఇనుపకడ్డీతో హైటెన్షన్ వైర్ల మీదపడిన గాలిపటం తీసుకోవనికి ప్రయత్నిస్తే కరెంట్ షాక్‌కొడ్తుంది. నిప్పు సంగతి తెలియని పసిపిల్లవాడు వెలుగుతున్న కొవ్వొత్తి పట్టుకోవడానికి ప్రయత్నిస్తే చెయ్యి కాలుతుంది. కాని కరెంటుకు షాక్‌కొట్టే గుణం, నిప్పుకు కాల్చే గుణం ఉన్నాయని పెద్దవాళ్ళు నమ్ముతారు. అంచేత వారు పసిపిల్లల్లా, పిచ్చివాళ్ళలా, మూర్ఖుల్లా ప్రవర్తించి ప్రమాదం కొనితెచ్చుకోరు.

అదేవిధంగా దేవుడు, దివ్యావిష్కృతి, పరలోకం గురించిన విషయాల్ని కూడా మానవుడు విశ్వసించి తదనుగుణంగా నడుచుకుంటే, అతను ఇటు ఇహలోకంలోనూ సుఖవంతమైన జీవితం గడుపుతాడు, అటు పరలోకంలోనూ శాశ్వత సౌఖ్యాలు అనుభవించగలడు.

ఇస్లాంలో 1-విశ్వాసం తరువాత ఇతర మూలస్తంభాలైన 2-నమాజ్, 3-జకాత్, 4-రమజాన్ రోజాలు, 5-హజ్‌యాత్రలు మనిషికి క్రియాజీవితంలోని వివిధ రంగాల్లో దైవాజ్ఞల్ని పాటించడానికి తగిన శిక్షణ ఇవ్వడానికి నిర్దేశించబడ్డాయి.



"నిస్సందేహంగా నమాజ్ (మనిషిని) చెడులు, అశ్లీల చేష్టల జోలికి పోకుండా నిరోధిస్తుంది." (ఖుర్ఆన్–29:45)

నమాజ్‌లో మనం ఖుర్ఆన్ పఠిస్తాం. ఖుర్ఆన్‌లో నీతినియాలు, సఖ్యతా సమైక్యతలు, దయాదాక్షిణ్యాలు, దానధర్మాలు, మానవహక్కులు మొదలైన సత్కార్యాలతో పాటు, వాటిని ఆచరించడంవల్ల లభించే ప్రయోజనాలు, ఆచరించకపోవడంవల్ల కలిగే నష్టాలను గురించి అనేక విషయాలు ఉన్నాయి. వాటిని మాటిమాటికి పఠించడం వల్ల మనిషి దుష్కార్యాలకు దూరంగా సదా సత్కార్యాలు చేస్తుంటాడు. ప్రతి విషయంలోనూ దేవునికి భయపడుతూ ఆయన ఆజ్ఞల్ని, దైవప్రవక్త (స) బోధనలను మాత్రమే పాటిస్తూ సాత్విక జీవితం గడుపుతాడు.

"దేవుడు జకాత్‌ను ముస్లింలకు విధిగా చేశాడు. ఇది వారి ధనికుల నుండి వసూలుచేసి, వారి పేదలకు అందజేయబడుతుంది." (బుఖారి)

పై హదీస్‌ని బట్టి జకాత్ పేదల హక్కని స్పష్టంగా తెలుస్తోంది. ఇస్లాం సౌధానికుండే అయిదు మూలస్తంభాలలో విశ్వాస ప్రకటన, నమాజ్‌ల తరువాత 'జకాత్' మూడవ స్తంభంగా పరిగణించబడుతోంది. ఖుర్ఆన్‌లో కనీసం 32 చోట్ల నమాజ్‌తో పాటు జకాత్ ప్రస్తావన వచ్చింది. దీన్నిబట్టి కూడా జకాత్‌కు ఎంత ప్రాముఖ్యం ఉందో తెలుస్తుంది. అదీగాక ఖుర్ఆన్ అనేకచోట్ల 'ఈమాన్' తర్వాత నమాజ్, జకాత్‌లను గురించి ప్రస్తావించి, ఇవే మొత్తం ధర్మానికి ముఖ్య ప్రాతిపదికలన్న భావం స్ఫురింపజేస్తుంది.

"రమజాన్ ఖుర్ఆన్ అవతరించిన నెల. ఈగ్రంథం మానవాళికి మార్గదర్శిని. ఇందులో రుజుమార్గం తెలిపే, సత్యాసత్యాలను, మంచీ చెడులను వేరుపరచి చూపే స్పష్టమైన బోధనలు ఉన్నాయి, కనుక ఇక నుండి మీలో రమజాన్ నెలను పొందేవారు ఆ నెలంతా విధిగా ఉపవాసం పాటించాలి." (ఖుర్ఆన్–2:185)



ఉపవాస వ్రతాలు పాటిస్తున్నప్పుడు వాటి బాహ్య నియమాలతో పాటు, అంతర్ నియమాలను కూడా పాటించాలి. ఉదాహరణకు అబద్ధమాడటం, చాడీలు చెప్పడం, దూషించడం, పరోక్షంగా నిందించడం, దురుసుగా మాట్లాడటం, అశ్లీలం పలకడం, జగడానికి దిగడం మొదలైన చేష్టలకు పాల్పడకూడదు. ఇవి ఇతర సమయాల్లో కూడా పాపకార్యాలే. అయితే ప్రత్యేకించి రమజాన్ నెలలో వీటికి మరీ దూరంగా ఉండాలి.

ఏవిధంగా నమాజ్ అందులో పఠించే ఖుర్ఆన్ ద్వారా మనిషికి దైవాదేశాలకు అనుగుణంగా జీవితం గడపటానికి నిరంతరం శిక్షణనిస్తుందో, అదేవిధంగా ఉపవాసం కూడా మనిషిలో ఆత్మనిగ్రహం, సహనం, స్థయిర్యం, దైవభీతి, పేదల పట్ల సానుభూతి పెంపొందే శిక్షణనిస్తుంది.

"అక్కడకు చేరుకోగలిగేవారు దాన్ని విధిగా సందర్శించాలి. (హజ్ చేయాలి.) ఇది ప్రజలపై దేవునికున్న హక్కు. ఈ ఆజ్ఞను శిరసావహించడానికి నిరాకరించేవాడు దేవుడు నిరపేక్షాపరుడని తెలుసుకోవాలి." (ఖుర్ఆన్–3:97)

అంతర్జాతీయ సమానత్వం, సౌభ్రాతృత్వాలకు సరైన అర్థం ఏమిటో, తెలుసుకో దలచినవారు జిల్‌హజ్జ 9, 10 తేదీలలో అరఫాత్, ముజ్దల్ఫాలకు వచ్చి చూడవచ్చు. ఇక్కడ ఎలాంటి అరుపులు, అలజడులు, కేకలు, కలహాలు మచ్చుకైనా కన్పించవు. ఒకేసారి, ఒకేచోట 30 నుంచి 50 లక్షల మంది హాజీల ఈ మానవ మహాసాగారం ఎలాంటి పోలీసుబందోబస్తు లేకుండా ఎంత ప్రశాంతంగా, నిశ్చింతగా ఉందో ప్రత్యక్షంగా చూస్తేనే తెలుస్తుంది.

ఒకరి భాష మరొకరికి తెలియని ఆ మహా జనసంద్రాన్ని ఒక్క గొడుకు క్రిందకు చేర్చగలిగిన ఆ మహత్తరశక్తి ఏమిటీ? అదే "దివ్యఖుర్ఆన్"– అదిచ్చే మానవీయ విలువలతో కూడిన ఏకదైవారాధనా సందేశం! "లాఇలాహ ఇల్లల్లాహు ముహమ్మద్ రసూలుల్లాహ్" (అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడు, ముహమ్మద్ ఆయన ప్రవక్త) అనే సద్వచనం బహిరంగంగా పఠించగానే మనిషి విశ్వప్రభువు సైన్యంలో భర్తీ అయిపోతాడు. ✪



# 16. నైతిక విలువలు

మనిషి అన్నాక నీతి ఎంతో అవసరం. ఆ నీతే లేకపోతే మనిషి పశువుకన్నా నికృష్టుడవుతాడు. అందుకే మన తెలుగునాట "నీతి లేనివాడు కోతికంటే పాడు" అన్న సామెత పుట్టింది. ఈ సామెత ప్రాతిపదికపైనే నీతిశతకాలు వెలువడ్డాయి. ఇక ఇస్లాంలోని ప్రతి ఆదేశంలోనూ నీతి సౌరభమే మనం ఆఘ్రాణిస్తాం. ఇస్లాంలోని విశ్వాసాలు, ఆరాధనలు, ఆదేశాలన్నీ మనిషిని నైతికంగా తీర్చిదిద్దడానికే నిర్దేశించబడ్డాయి.

"విశ్వాసులలో అందరికంటే గొప్ప సద్గుణసంపన్నుడే విశ్వాసంలోనూ పరిపూర్ణుడు." (అబూదావూద్); "దేవుని త్రాసులో మంచి నడవడిక కంటే బరువైన వస్తువు మరేదీ లేదు." (అబూదావూద్, తిర్మిజి)

"ప్రజలను ఎక్కువగా స్వర్గానికి గొనిపోయే విషయాలేమిటో తెలుసా? అవి దైవభీతి, సత్ప్రవర్తన. ప్రజలను ఎక్కువగా నరకాగ్ని వైపు తీసికెళ్ళే విషయాలేమిటో తెలుసా? అవి నోరు, మర్మావయవం." (మిష్కాత్)

"ఎవరి నోరు,చేతుల వల్ల తోటిముస్లింలు బాధపడకుండ ఉంటాడో అతనే (నిజమైన) ముస్లిం. అలాగే దేవుడు మానేయమన్న వాటిని మానేసేవాడే ముహాజిర్ (దైవమార్గంలో వలసపోయినవాడు)." (బుఖారీ, ముస్లిం)

"మృదుస్వభావం లేనివాడిలో మంచితనం ఉండదు." (జరీర్–ముస్లిం)

"దేవుని సూక్తులు విశ్వసించనివారే అబద్ధాలు పలుకుతారు." (16:105); "అబద్ధాలకోరు, దుష్కర్ముడైన ప్రతివాడికీ వినాశం ఉంది."(ఖురాన్–45:7)

"ఎవరైనా ఓ జానెడు భూమి అయినా బలవంతంగా స్వాధీనం చేసుకుంటే దేవుడు అతని మెడలో ఏడు భూమండలాల కంఠపాశం వేస్తాడు."(ముస్లిం)

"కోపం ప్రదర్శించే శక్తి ఉండికూడా కోపాన్ని దిగమింగేవాడ్ని దేవుడు ప్రళయదినాన సృష్టిరాసులందరి ముందుకు పిలిచి (స్వర్గంలోని) విశాలాక్షులైన సుందరాంగుల్లో నీకు నచ్చినదాన్ని ఎంపిక చేసుకోవచ్చు"ని అంటాడు.(తిర్మిజీ)

"కుస్తీపట్టి ఇతరులను చిత్తుచేసేవాడు పరాక్రమశాలి కాదు. ఆగ్రహం వచ్చినప్పుడు నిగ్రహించుకునేవాడే నిజమైన పరాక్రమశాలి. (బుఖారీ)

"దేవుడు తన దాసుల్లో జాలిగుండెలుగల వారిపైనే జాలిచూపుతాడు." ; "ప్రజలపై దయజూపని మనిషిపై దేవుడు కూడా దయజూపడు." (బుఖారీ)

"భూవాసులపై దయజూపండి, ఆకాశంలో ఉన్నవాడు మీపై దయజూపుతాడు." (బుఖారీ, ముస్లిం); "మీరు ఇతరులపై దయజూపండి; దేవుడు మీపై దయజూపుతాడు. మీరు ఇతరుల తప్పులు క్షమించండి; దేవుడు మీ తప్పులు క్షమిస్తాడు." (ముస్నద్ అహ్మద్)

"అసూయకు దూరంగా ఉండండి. అగ్ని కట్టెల్ని కాల్చినట్లు. అసూయ సత్కర్మల్ని భస్మీపటలం చేస్తుంది." (అబూదావూద్)

"నిందించే, హేళన చేసే, చాడీలు చెప్పే ప్రతివాడికీ వినాశం ఉంది." (104:1); "చీటికిమాటికి ఒట్లు వేసుకునే తుచ్ఛుడు, ఎత్తిపొడిచేవాడు, చాడీలు చెబుతూతిరిగేవాడు, సత్కార్యాలనుండి నిరోధించేవాడు, మితిమీరిన దౌర్జన్యాలకు పాల్పడేవాడు, ఘోరపాపి, పరమదుర్మార్గుడు, ఏమాత్రం నీతిలేని నికృష్టుడు...(అలాంటివాడికి లొంగకు)." (ఖుర్ఆన్:68:11-14)

"జనమ్ముందు గర్వంతో మాట్లాడకు. భూమిపై నిక్కుతూ నీల్గుతూ నడవకు. తనను తాను పొగడుకునే, మిడిసిపడే వాడ్ని దేవుడు ఏమాత్రం మెచ్చుకోడు." (ఖుర్ఆన్-31:18)

"మీరు మీ ప్రవర్తనావైఖరిని లోకుల ప్రవర్తనావైఖరికి అనుగుణంగా మార్చుకోకండి. ఇతరులు మంచిచేస్తే తామూ మంచి చేస్తామని, ఇతరులు దౌర్జన్యం చేస్తే తామూ దౌర్జన్యం చేస్తామని చెప్పడం సరికాదు. మిమ్మల్ని మీరుఒక నియమావళికి కట్టుబడి ఉండేలా రూపొందించుకోండి. ఇతరులు మేలుచేస్తే మీరూ మేలుచేయండి. కాని ఇతరులు మీకు అపకారం తలపెడ్తే మీరు మాత్రం వారికి అపకారం తలపెట్టకండి." (హదీస్) ✯



# 17. జవాబుదారీ భావన

ఇహలోకం తాత్కాలికమైనది. మానవుని అసలుజీవితం మరణానంతరమే మొదలవుతుంది. అదే పరలోకజీవితం. పరలోకజీవిత సాఫల్య, వైఫల్యాలు ఇహలోకజీవితంలో అతను ఆచరించే కర్మల్నిబట్టే ఉంటాయి. పరలోక జీవితంలో సాఫల్యం పొందడానికి ఇహలోకంలోనే పాటుపడటం బుద్ధిమంతుని లక్షణం. అశాశ్వతమైన ఐహికజీవితంలోని సౌఖ్యాల కోసం శాశ్వతమైన పరలోక జీవితాన్ని మూర్ఖుడు మాత్రమే నాశనంచేసుకుంటాడు. మనిషి తాను చేసే ప్రతి పనికీ దేవుని ముందు జవాబు చెప్పుకోవలసి ఉంటుంది.

మీకు ఇవ్వబడినదంతా ప్రాపంచిక జీవనసంపద, క్షణికమైన దాని తళుకుబెళుకులు మాత్రమే. దేవుని దగ్గర ఉన్నది ఇంతకంటే ఎంతో శ్రేష్ఠమైనది, శాశ్వతమైనది. మీరు బుద్ధి నుపయోగించి ఆలోచించరా? (ఖుర్ఆన్-28:60)

"ప్రపంచాన్ని ప్రేమించేవాడు తన పరలోకాన్ని నాశనం చేసుకుంటాడు; పరలోకాన్ని ప్రేమించేవాడు తన ప్రపంచాన్ని నష్టపరచుకుంటాడు. కనుక ప్రజలారా! మీరు అంతమయిపోయే (ఐహిక) జీవితం కంటే శాశ్వతంగా ఉండే (పరలోక) జీవితానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వండి." (మిష్కాత్)

"వీరు తమ చేష్టల్ని ప్రజల కంటబడకుండా దాచగలరుగాని దేవుని కంటబడకుండా దాచలేరు." (ఖుర్ఆన్-4:108)

"మేము విశ్వసించామని అన్నంతమాత్రాన తమను పరీక్షించకుండా వదలి పెట్టడం జరుగుతుందని ముస్లింలు భావిస్తున్నారా? వారికి పూర్వం గతించిన వారందర్నీ మేము పరీక్షించాము. (వారిలో) సత్యవాదులెవరో, అసత్యవాదులెవరో తప్పనిసరిగా పరీక్షించి తెలుసుకోవలసిన బాధ్యత దేవునిపై ఉంది." (ఖుర్ఆన్- 29:2,3)

"మానవుని కుడి, ఎడమల వైపు ఇద్దరు (అదృశ్య) లేఖకులు కూర్చొని (అతని) ప్రతి పనినీ, ప్రతి పలుకునూ నమోదు చేస్తున్నారు. అతని నోట



ఏదైనా మాట వెలువడగానే దాన్ని నమోదుచేయడానికి ఒక పర్యవేక్షకుడు తక్షణమే అక్కడ ప్రత్యక్షమవుతాడు." (50:17,18)

**నిష్ఠ దరిద్రుడు:** "నా అనుచర సముదాయంలో ప్రళయదినాన ఒకడు నమాజ్, జకాత్, రోజాలు వగైరా సత్కార్యాలు తీసుకొని వస్తాడు. అయితే అతను ఎవరినైనా దూషించి ఉంటాడు. ఎవరిపైనైనా అపవాదు లేపి ఉంటాడు. ఎవరి ధనాన్నయినా అన్యాయంగా కాజేసిఉంటాడు. ఎవరినైనా హత్యచేసి ఉంటాడు. ఎవరినైనా అన్యాయంగా కొట్టిఉంటాడు. అంచేత అతను ఎవరెవరిని వేధించాడో, ఎవరెవరి హక్కులు కొల్లగొట్టాడో వారందరికీ అతని పుణ్యకర్మలు పంచిస్తారు. అప్పటికీ వారి హక్కులు పూర్తిగా నెరవేరకముందే అతని పుణ్యకర్మలు అంతమైపోతే, ఆ హక్కుదారులు చేసిన పాపాలు అతని ఖాతాలో వేసి అతడ్ని నరకంలో పడవేయడం జరుగుతుంది." (ముస్లిం) ✯


హదీస్ హితోక్తులు

**సంక్షిప్తంలో సమగ్ర స్వరూపం**

వివిధ ఉర్దూగ్రంథాల నుండి ఎంపిక చేసి అత్యాధునిక విషయసూచికతో వెలువడిన గ్రంథం ఇది. లోగడ తెలుగులో వెలువడిన గ్రంథాలలోని దాదాపు హదీసులన్నీ ఇందులో చూడవచ్చు. అంటే విషయపరిజ్ఞానం రీత్యా సంక్షిప్తంలో సమగ్రం అన్నట్లు వేలాది పేజీల లోని సమాచారమంతా దాదాపు 2125 హదీసులతో కేవలం 624 పేజీలలో, కాంప్యాక్ట్‌డిస్క్‌లా ఈ గ్రంథంలో ఇమిడిపోయిందన్న మాట.




రచన: అబుల్ ఇర్ఫాన్, పే:624, వెల: రూ225/-

**ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్-2, ✆ 9441515414**




# 18. తెలుగు లిపి సూరాలు

"విశ్వాసికి, అవిశ్వాసికి మధ్య వారిద్దరినీ వేరుచేసే హద్దు నమాజే" అని దైవప్రవక్త సెలవిచ్చారు. (ముస్లిం)-

ముస్లిం అని చెప్పుకునే వ్యక్తి ఇంతటి ముఖ్య విధి అయిన నమాజ్‌నే వదిలేస్తే ఇక అతనికి, ఇతర మతస్థులకు ఎలాంటి తేడా లేదని ఈ హదీసు తెలియజేస్తోంది.

"ఒంటరిగా చేసే నమాజ్ కంటే సామూహికంగా చేసే నమాజ్ 27 రెట్లు శ్రేష్ఠమైనది" అని దైవప్రవక్త (స) తెలిపారు. (బుఖారి, ముస్లిం)

"ఎలాంటి అవరోధం లేకపోయినా సామూహిక నమాజ్ చేయడానికి రాని మనిషి ఒంటరిగా చేస్తే ఆ నమాజ్ స్వీకరించబడదు" అన్నారు దైవప్రవక్త (స). అనుచరులు ఈమాట విని "అవరోధం అంటే ఏమిటీ?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "అవరోధమంటే భయం లేదా ఏదైనా వ్యాధి" అన్నారు. (అబూదావూద్)

కనుక నమాజ్‌లో పఠించే సనా, సూరాలు, తషహ్హుద్, ఖునూత్‌ల మూలభాషను ఇక్కడ తెలుగులిపితో పాటు వాటిఅర్థాలు పేర్కొంటున్నాను.

**సనా :** "సుబ్‌హానక అల్లాహుమ్మ వబిహమ్‌దిక వతబారకస్ముక వతఆలా జద్దుక వలాఇలాహ గైరుక్" (దేవా! నీవు పరమ పవిత్రుడవు. ప్రశంసలకు నీవే అర్హుడవు. నీవే శుభదాయకుడవు, మహోన్నతుడవు. నీ పేరు, ప్రాభవం ఎంతో ఉన్నతమైనవి. నీవు తప్ప మరే ఆరాధ్యనీయుడు లేడు.)

**1-ఫాతిహా సూరా:** "అల్‌హమ్దులిల్లాహి రబ్బిల్‌ఆలమీన్①.అర్రహ్మానిర్రహీం②మాలికియౌమిద్దీన్③.ఇయ్యాకనఅ్‌బుదు వఇయ్యాకనస్తయీన్④. ఇహ్దినస్సిరాతల్ ముస్తఖీమ్⑤ సిరాతల్లజీన అన్‌అమ్‌తఅలైహిమ్⑥ గైరిల్ మగ్‌జూబి అలైహిమ్ వలజ్జాల్లీన్⑦. (ఆమీన్.)

(అర్థం: సమస్త లోకాలకు స్వామి, ప్రభువయిన అల్లాహ్‌కే సకల విధాల ప్రశంసలు శోభిస్తాయి. ఆయన కరుణామయుడు, కృపాసాగరుడు, పరలోక విచారణ దినానికి అధిపతి. దేవా! మేము నిన్నే ఆరాధిస్తున్నాము. నీ సహాయమే అర్థిస్తున్నాము. మాకు రుజుమార్గం చూపు. నీ ఆగ్రహానికి గురయి దారి తప్పినవారి మార్గం కాకుండా, నీ అనుగ్రహానికి పాత్రులయినవారి మార్గమే మాకు చూపించు.) (ఖుర్‌ఆన్–1:) తథాస్తు.

**2–అలమ్నష్రహ్:**“అలమ్‌నష్రహ్ లకసద్రక ①వవజఅ్‌నా అన్కవిజ్రక ②ల్లజీ అన్ఖజ జహ్‌రక ③ వరఫఅ్‌నా లక జిక్రక్ ④. ఫఇన్నమఅల్ ఉస్రియుస్రన్ ⑤ ఇన్నమఅల్ ఉస్రియుస్రా ⑥. ఫఇజా ఫరగ్త ఫన్సబ్ ⑦వఇలారబ్బిక ఫర్గబ్ ⑧.”

(అర్థం: (ముహమ్మద్!) మేము నీ హృదయం తెరచి నీకు శాంతి చేకూర్చ లేదా? మేము నీపై నుండి వెన్నువిరిచే భారం తీసివేశాం. నీకోసం నీ (పేరు ప్రతిష్ఠల) ప్రస్తావన ఉన్నతం చేశాం. కష్టాలు–కాఠిన్యాల తర్వాత సుఖాలు–సౌలభ్యాలు కూడా వస్తాయి. ఔను, కష్టాలు–కాఠిన్యాల తర్వాత సుఖాలు–సౌలభ్యాలు తప్పక వస్తాయి. కనుక నీ దైనందిన కార్యకలాపాలు ముగిశాక కఠోరారాధనలో లీనమై నీప్రభువుపైనే మనస్సు లగ్నంచెయ్యి.)–(94)

**3–తీన్:** వత్తీని వజ్జయ్‌తూని ①వతూరిసీనీన ②వహాజల్ బలదిల్‌అమీని ③ లఖద్‌ఖలఖ్నల్ ఇన్సాన ఫీఅహ్సని తఖ్వీమ్ ④.సుమ్మరదద్‌నాహు అస్ఫలసాఫిలీన ⑤ఇల్లల్లజీనఆమనూ వఅమిలుస్సాలిహాతి ఫలహుమ్‌అజ్రున్ గైరుమమ్నూన్ ⑥ ఫమాయుకజ్జిబుక బఅ్‌దుబిద్దీన్ ⑦. అలైసల్లాహు బిఅహ్కమిల్ హాకిమీన్ ⑧.

(అర్థం : అంజూరం, ఆలివ్ (వృక్షా)ల సాక్షి! సీనాయ్ కొండల సాక్షి! ఈ శాంతినగరం(మక్కా) సాక్షి! మేము మానవుడ్ని ఎంతో ఉత్కృష్టజీవిగా సృజించాం. తర్వాత మేమతడ్ని (సత్యనిరాకరణ వల్ల) వెనక్కి తిప్పి అతి నికృష్టజీవిగా మార్చివేశాం. అయితే సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నులైనవారిని ఈ నికృష్టత్వం నుండి తప్పించాం. ఇలాంటి వారికోసం మేము ఎన్నటికీ



అంతంకాని గొప్ప సుకృతఫలం సిద్ధపరచిఉంచాం. కనుక (మానవుడా!) అలాంటప్పుడు నీవు పరలోక విచారణ గురించిన సత్యాన్ని ఎలా నిరాకరిస్తావు? దేవుడు అందరికంటే గొప్ప అధికారి కాదా?)–(95)

**4–ఖద్ర్ :** ఇన్నాఅన్‌జల్నాహు ఫీలైలతిల్ ఖద్రి ①వమాఅద్రాక మాలైలతుల్ ఖద్ర్ ②. లైలతుల్‌ఖద్రి ఖైరుమ్మిన్‌అల్ఫి షహ్‌రిన్ ③. తనజ్జలుల్ మలాయికతు వర్రూహు ఫీహా బిఇజ్ని రబ్బిహిమ్ మిన్‌కుల్లి అమ్రిన్ ④ సలామున్ హియ హత్తా మత్‌లయిల్ ఫజ్ర్ ⑤.

(అర్థం: మేము దీన్ని ఘనతగల మహారాత్రిన అవతరింపజేశాం. ఘనతగల ఆరాత్రి ఏమిటో నీకేంతెలుసు? ఆమహారాత్రి వేయినెలల కన్నా శ్రేష్ఠమైనది. ఆరాత్రి పరిశుద్ధాత్మ, దైవదూతలు తమ ప్రభువు అనుమతితో ప్రతి వ్యవహారానికి సంబంధించిన ఆజ్ఞలు తీసుకొని అవతరిస్తారు. అది ఉషోదయం దాకా పూర్తిగా శుభవంతమైన రాత్రి.)–(97)

**5–జిల్జాల్:** ఇజాజుల్ జిలతిల్‌అర్జు జిల్‌జాలహా ①వఅఖ్రజతిల్ అర్జు అస్ఖాలహా ②వఖాలల్ ఇన్సాను మాలహా ③. యౌమఇజిన్ తుహద్దిసు అఖ్బారహా ④ బిఅన్నరబ్బక అవ్‌హాలహా ⑤. యౌమఇజియ్యస్‌దురున్నాసు అష్‌తాతల్లి యురవ్ అఅ్‌మాలహుమ్ ⑥. ఫమన్‌య్యఅ్‌మల్ మిస్‌ఖాల జర్రతిన్ ఖైరన్‌య్యరహ్ ⑦. వమన్‌య్యఅ్‌మల్ మిస్‌ఖాల జర్రతిన్ షర్రన్‌య్యరహ్ ⑧.

(అర్థం: భూమి తీవ్ర ప్రకంపనలతో కుదిపేయబడుతుంది. అది తనలోని భారమంతా తీసి బయటపడవేస్తుంది. అప్పుడు మానవుడు “ఏమైంది దీనికి?” అంటాడు. ఆరోజు భూమి పరిస్థితులు వివరిస్తుంది. కారణం, నీ ప్రభువు దాన్ని ఆదేశించి ఉంటాడు. ఆ రోజు మానవులు విభిన్న వర్గాలుగా విడిపోయి (న్యాయస్థానం నుండి) తిరిగొస్తారు. అప్పుడు వారికి వారి కర్మలు చూపించబడతాయి. ఆ తర్వాత ఎవరైనా అణుమాత్రం సత్కార్యం చేసివున్నా అతను దాన్ని (కళ్ళారా) చూసుకుంటాడు. అలాగే ఎవరైనా అణుమాత్రం దుష్కార్యం చేసివున్నా అతనూ దాన్ని (కళ్ళారా)చూసుకుంటాడు.)–(99)



**6–ఆదియాత్:** వల్‌ఆదియాతి జబ్‌హన్ ①ఫల్‌మూరియాతి ఖద్‌హన్ ② ఫల్‌ముగీరాతి సుబ్‌హన్ ③ ఫఅసర్నబిహీ నఖ్‌అన్ ④ ఫవసత్న బిహీ జమ్‌అన్ ⑤ ఇన్నల్ ఇన్సాన లిరబ్బిహీ లకనూద్ ⑥. వఇన్నహూ అలాజాలిక లషహీద్ ⑦. వఇన్నహూ లిహుబ్బిల్ ఖైరి లషదీద్ ⑧. అఫలా యఅ్‌లము ఇజాబుఅ్‌సిర మాఫిల్ ఖుబూరి ⑨ వహుస్సిల మాఫిస్సుదూరి ⑩ఇన్న రబ్బహుమ్ బిహిమ్ యౌమయిజిన్ ల్లఖబీర్(11).

(అర్థం: నురుగులు కక్కుతూ, నిప్పురవ్వలు రాల్చుతూ పరుగెత్తే గుర్రాల సాక్షి! అవి తెల్లవారేటప్పటికి వచ్చిపడతాయి. దుమ్ములేపుతూ చివరికి (శత్రు) సమూహంలోకి చొచ్చుకుపోతాయి. మానవుడు తన ప్రభువుకు చాలా కృతఘ్నుడైపోయాడు. దానికి అతనే సాక్ష్యం. అతను ధనవ్యామోహంలో పూర్తిగా కూరుకుపోయాడు. సమాధుల్లో వున్నవాటిని తీసిబ్రతికించి, అంతరంగాల్లో ఉన్నవాటిని రట్టుచేయడం జరుగుతుందని అతనికి తెలియదా? ఆరోజు అతడ్ని గురించి అతని ప్రభువుకే బాగా తెలుసు.)–(100)


**ఆత్మకు చావు ఉందా లేదా?**

**పరలోక ప్రస్థానం**




అదేమోగాని ఆత్మ మన దేహం వీడిపోగానే అనేక మజిలీలు దాటుకుంటూ తన శాశ్వత గమ్యానికి చేరుకుంటుందని మాత్రం తెలుస్తోంది. అదెలాగో తెలుసు కోవాలంటే ఈ పుస్తకం చదవండి.

ఇందులో శరీరం గగుర్పొడిచే మరణావస్థ, పిత్రు లోకం, సమాధిలో ఖుర్‌ఆన్‌పాత్ర, ప్రళయసూచనలు, కర్మవిచారణ, త్రిశంకుస్వర్గం, స్వర్గ–నరకాలు, అథమ శ్రేణి స్వర్గవాసి, దైవదర్శనం వగైరా విశేషాలున్నాయి.

రచన: అబుల్ ఇర్ఫాన్, (పే:240, వెల: రూ110/–)

**ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్–2, ✆ 9441515414**




**7–ఖారిఆ**: అల్‌ఖారిఅతు ①మల్‌ఖారిఅహ్ ②. వమాఅద్రాక మల్‌ఖారిఅతు ③ యౌమ యకూనున్నాసు కల్‌ఫరాషిల్ మబ్‌సూసి ④వతకూనుల్ జిబాలుకల్ ఇహ్‌నిల్ మన్‌ఫూష్ ⑤. ఫఅమ్మామన్ సఖులత్ మవాజీనుహూ ⑥ ఫహువ ఫీఈషతిన్ రాజియహ్ ⑦. వఅమ్మామన్ ఖఫ్ఫత్ మవాజీనుహూ ⑧ ఫఉమ్ముహూ హావియహ్ ⑨. వమాఅద్రాక మాహియహ్ ⑩. నారున్ హామియహ్ (11).

(అర్థం: మహోపద్రవం! ఏమిటా మహోపద్రవం? ఆ మహోపద్రవం ఏమిటో నీకేం తెలుసు? ఆరోజు మానవులు చెల్లాచెదరైన దీపపుపురుగుల్లా అవుతారు. పర్వతాలు రంగురంగుల దూదిపింజల్లా మారిపోతాయి. ఆ తర్వాత ఎవరి త్రాసుపళ్ళెం బరువుగా ఉంటుందో అతను భోగభాగ్యాలలో ఓలలాడుతాడు. మరెవరి త్రాసుపళ్ళెం తేలికగా ఉంటుందో అతను అథఃపాతాళానికి పోతాడు. అథఃపాతాళమంటే ఏమిటో నీకేం తెలుసు? భగభగమండే అగ్ని.)–(101)

**8–తకాసుర్:** “అల్‌కుముత్తకాసురు ①హత్తా జుర్‌తుముల్ మఖాబిర్ ②. కల్లాసౌఫ తఅ్‌లమూన ③సుమ్మకల్లా సౌఫ తఅ్‌లమూన్ ④. కల్లా లౌతఅ్‌లమూన ఇల్మల్‌యఖీన్ ⑤. లతరవున్నల్ జహీమ ⑥సుమ్మ లతరవున్నహా ఐనల్‌యఖీని ⑦ సుమ్మ లతుస్‌అలున్న యౌమయిజిన్ అనిన్నయీమ్ ⑧.”

(అర్థం: ప్రాపంచిక వ్యామోహంలో పోటీపడి వీలైనంత ఎక్కువ సంపాదించాలన్న తపనే మిమ్మల్ని ఏమరుపాటులో పడవేసింది. చివరికి (అదేరందిలో) మీరు సమాధికి చేరుకుంటారు. (మీరసలు ప్రాపంచిక సంపదే ప్రగతికి చిహ్నమని అనుకుంటున్నారు కాబోలు.) ఎంతమాత్రం కాదు. త్వరలోనే మీకు తెలుస్తుంది (వాస్తవం ఏమిటో). ఎంతమాత్రంకాదు. త్వరలోనే మీకు తెలుస్తుంది. ఎంతమాత్రంకాదు. విశ్వసనీయ జ్ఞానంతో విషయాన్ని గ్రహిస్తే (మీవైఖరి ఇలా ఉండదు). మీరు తప్పక నరకాన్ని చూస్తారు. ఔను, మీరు నమ్మకంగా దాన్ని మీకళ్ళారా చూస్తారు. ఆరోజు ఈ సౌఖ్యాలు, సిరిసంపదల్ని గురించి మిమ్మల్ని తప్పక నిలదీయడం జరుగుతుంది.)–(102)

**9–అస్ర్:** "వల్అస్రి①ఇన్నల్ ఇన్సాన లఫీ ఖుస్రిన్②ఇల్లల్లజీన ఆమనూ వ అమిలుస్ సాలిహాతి  వతవాసౌ బిల్‌హఖ్ఖి వతవాసౌ బిస్సబ్ర్③."

(అర్థం: కాలచక్రం సాక్షి! మానవుడు ఘోరంగా నష్ట పోయాడు. అయితే సత్యాన్ని విశ్వసించి సత్కార్యాలు చేస్తూ సత్యం, సహనాలను గురించి పరస్పరం ఉపదేశించుకునేవారు మటుకు ఏమాత్రం నష్టపోరు.)–(103)

**10–ఫీల్:** అలమ్‌తరకైఫ ఫఅలరబ్బుక బిఅస్‌హాబిల్ ఫీల్①. అలమ్‌యజ్అల్ కైదహుమ్ ఫీతజ్‌లీలిన్②వ్వఅర్సల అలైహిమ్ తైరన్ అబాబీల③ తర్మీహిమ్ బిహజారతిమ్మిన్ సిజ్జీలిన్④ ఫజఅలహుమ్ కఅస్ఫిమ్మఅ్‌కూల్⑤.

(అర్థం: నీ ప్రభువు ఏనుగుల వాళ్ళను ఏం చేశాడో నీకు తెలియదా? ఆయన వారి (దుష్ట) యత్నాలను వమ్ము చేయలేదా? వారి మీదికి ఆయన పక్షుల్ని గుంపులు గుంపులుగా పంపాడు. అవి వారి మీద కంకర్రాళ్ళు విసరిపడేశాయి. దాంతో వారు పశువులు తిని ఆగం చేసిన మేతలా (సర్వ నాశనం) అయ్యారు.)–(105)

**11–ఖురైష్:** లిఈలాఫి ఖురైషిన్① ఈలా ఫిహిమ్ రిహ్‌లతష్షితాఇ వస్సయ్‌ఫ్②. ఫల్‌యఅ్‌బుదూ రబ్బహాజల్‌బైతి③ల్లజీ అత్‌అమహుమ్మిమ్మిన్ జూఇన్‌వ్వ ఆమనహుమ్ మ్మిన్‌ఖౌఫ్④.

(అర్థం: ఖురైషీయులు అలవాటు పడ్డారట! చలికాలంలోనూ, ఎండాకాలం లోనూ  ప్రయాణం చేయడానికి బాగా అలవాటు పడ్డారట!! అలాగైతే వారీ (కాబా)ఆలయం ప్రభువును ఆరాధించాలి. వారికి ఆహారమిచ్చి ఆకలి తీర్చిన వాడు, శాంతి ప్రసాదించి భయం పోగొట్టినవాడు ఆయనే కదా!)–(106)

**12–మావూన్:** అరఐతల్లజీ యుకజ్జిబు బిద్దీన్①. ఫజాలికల్లజీ యదువ్వుల్ యతీమ②  వలాయహుజ్జు అలాతఆమిల్ మిస్కీన్③. ఫవైలుల్లిల్ ముసల్లీన ④ల్లజీన హుమ్ అన్‌సలాతిహిమ్ సాహూన⑤ల్లజీన హుమ్‌యురావూన⑥ వయమ్‌నవూనల్ మావూన్⑦.



(అర్థం: పరలోక తీర్పును ధిక్కరించేవాడ్ని నీవు గమనించావా? అతనే అనాథలను కసరికొట్టేవాడు. పేదల అన్నదానం కోసం (ఇతరుల్ని) ప్రోత్స హించనివాడు. ప్రార్థన పట్ల అశ్రద్ధ, ఏమరుపాటులు వహించేవారికి వినాశం (రాసిపెట్టి) ఉంది. వారు ప్రతిపనీ లోకుల మెప్పు కోసం ప్రదర్శనాబుద్ధితో చేస్తుంటారు. (మితిమీరిన పిసినారితనంతో) వాడుకునే సాధారణ వస్తువుల్ని సైతం ఇతరులకు ఇవ్వడానికి నిరాకరిస్తారు.)–(107)

**13–కౌసర్:** ఇన్నాఅఅ్‌తైనా కల్‌కౌసర్①. ఫసల్లి లిరబ్బిక వన్‌హర్② ఇన్న షానిఅక వువల్‌అబ్తర్③.

(అర్థం: (ముహమ్మద్!) మేము నీకు కౌసర్ (సరోవరం) ప్రసాదించాము. కనుక నీవు నీప్రభువు (ప్రసన్నత) కోసమే ప్రార్థన (నమాజ్) చెయ్యి; ఆయన కోసమే త్యాగం చెయ్యి. నీ శత్రువే భవిష్యత్తులేని దౌర్భాగ్యుడు.)–(108)

**14–కాఫిరూన్:** "ఖుల్ యాఅయ్యుహల్ కాఫిరూన①లాఅఅ్‌బుదు మా తఅ్‌బుదూన ②వలాఅన్తుమ్ ఆబిదూన మాఅఅ్‌బుద్③. వలాఅనా ఆబిదున్ మ్మాఅబద్‌త్తుమ్④వలా అన్‌తుమ్ ఆబిదూన మాఅఅ్‌బుద్⑤. లకుమ్ దీనుకుమ్ వలియదీన్⑥.

(అర్థం: వారికిలా చెప్పు: అవిశ్వాసులారా! మీరు ఆరాధిస్తున్నవాటిని నేను ఆరాధించను. నేను ఆరాధిస్తున్న దైవాన్ని మీరు ఆరాధించరు. మీరు ఆరాధి స్తున్నవాటిని నేను ఆరాధించే మనిషినికాను. నేను ఆరాధించే దైవాన్ని మీరు ఆరాధించే రకం కాదు. (కనుక) మీధర్మం మీకే, నాధర్మం నాకే.)–(109)

**15–నస్ర్:** ఇజాజాఅ నస్‌రుల్లాహి వల్‌ఫత్‌హు①వరాయితన్నాస యద్‌ఖులూన ఫీదీనిల్లాహి అఫ్‌వాజన్②ఫసబ్బిహ్ బిహమ్దిరబ్బిక వస్తగ్ఫిర్‌హు. ఇన్నహూ కానతవ్వాబా③.

(అర్థం: ప్రవక్తా! దేవుని సహాయం వచ్చి, విజయం లభించిన తర్వాత ప్రజలు తండోపతండలుగా దైవధర్మంలో చేరుతుండటం నీవు గమనిస్తూనే



ఉన్నావు. కనుక నీ ప్రభువు ఔన్నత్యం స్తుతిస్తూ, ఆయన పవిత్రతను ప్రశంసిస్తూ ఉండు. దాంతోపాటు ఆయన సన్నిధిలో నీ పొరపాట్లకు క్షమాపణ కోరుకో. ఆయన గొప్పక్షమాశీలి.)–(110)

**16–లహబ్:** తబ్బత్‌యదా అబీలహబివ్వ తబ్బ①. మాఅగ్నా అన్‌హు మాలుహూ వమాకసబ్②. సయస్‌లా నారన్‌జాత లహబిన్③వ్వమ్‌ర అతుహూ. హమ్మాలతల్ హతబ్④. ఫీజీదిహా హబ్‌లుమ్మిమ్మసద్⑤.

(అర్థం: అబూలహబ్ చేతులు విరిగిపోవు గాక! అతడు సర్వనాశనమై పోవుగాక! అతని సంతానం, సిరిసంపదలేవీ అతనికి ఏమాత్రం పనికిరాకుండా పోతాయి. అతను తప్పక భగభగ మండే (నరకా)అగ్నిలో విసరేయబడతాడు. (అతనితో పాటు) తగవులు పెట్టి తమాషా చూసే అతనిభార్య కూడా (నరక కూపంలో పడిపోతుంది. మరణానంతరం) ఆమె మెడలో బాగా పేనిన గట్టి తాడొకటి (కంఠపాశంగా) ఉంటుంది.)–(111)

**17–ఇఖ్లాస్:** ఖుల్ హువల్లహుఅహద్①. అల్లాహుస్సమద్②. లమ్‌యలిద్ వలమ్‌యూలద్③. వలమ్ యకున్‌ల్లహూ కుఫువన్ అహద్④.

(అర్థం: చెప్పు, ఆయన అల్లాహ్, ఏకైక దేవుడు. ఆ దేవుడు ఎవరి అవసరమూ లేని నిరపేక్షాపరుడు. ఆయనకు ఎలాంటి సంతానం లేదు. ఆయన ఎవరికీ సంతానంగా లేడు. ఆయనకు సమానమైన వారెవరూ లేరు. ఆయన సాటిలేని మహామేటి.)–(112)

**18–ఫలఖ్:** ఖుల్ అవూజు బిరబ్బిల్ ఫలఖి① మిన్‌షర్రి మాఖలఖ② వ మిన్‌షర్రి గాసిఖిన్ ఇజావఖబ③వమిన్‌షర్రి న్నఫ్ఫాసాతి ఫిల్‌ఉఖది④వ మిన్‌షర్రి హాసిదిన్ ఇజాహసద్⑤.

(అర్థం: చెప్పు, నేను అరుణోదయానికి ప్రభువైన దేవుని శరణుగోరుతు న్నాను. ఆయన సృష్టించిన ప్రతిదాని కీడు నుండి, ముసురుకొచ్చే రాత్రిచీకటి కీడు నుండి, (మంత్ర)ముడులపై ఊదేవారి కీడు నుండి, అసూయపడుతున్న



అసూయాపరుడి కీడునుండి నేను ఆయన శరణుగోరుతున్నాను.

**19–నాస్:** ఖుల్ అవూజుబిరబ్బిన్నాసి①  మలికిన్నాసి② ఇలాహిన్నాసి③ మిన్‌షర్రిల్ వస్‌వాసిల్ ఖన్నాసి④ల్లజీ యువస్‌విసు ఫీసుదూరిన్నాసి⑤ మినల్‌జిన్నతి వన్నాస్⑥.

(అర్థం: చెప్పు, మాటిమాటికి వచ్చి భ్రమలు కలిగించి కలతలు రేపేవాడి కీడునుండి నేను మానవుల ప్రభువు, చక్రవర్తి, ఆరాధ్యదైవం (అయిన దేవుని) శరణు గోరుతున్నాను. ప్రజల హృదయాలలో భ్రమలు కలిగించి కలతలు రేపేవాడు మానవుల్లోనూ ఉండవచ్చు; జిన్నులలోనూ ఉండవచ్చు.)–(114)

**తషహ్హుద్:** "అత్తహియ్యాతు లిల్లహి వస్సలాతు వత్తయ్యిబాతు అస్సలాము అలైక అయ్యు హన్నబియ్యు వరహ్మతుల్లహి వ బరకాతుహూ అస్సలాము అలైనా వఅలా ఇబాదిల్లాహి స్సాలిహీన అష్‌హదు అన్‌ల్లాఇలాహ ఇల్లల్లాహు వఅష్‌హదు అన్న ముహమ్మదన్ అబ్‌దుహూ వరసూలుహూ."


ధన వికేంద్రీకరణ




**డబ్బంటే ఎవరికి చేదండీ?**

*కాని ధర్మాధర్మాల విచక్షణ చేయకుండా అడ్డదారుల గుండా సంపాదిస్తూ, విచ్చలవిడిగా ఖర్చు చేసేవారికి ఈ ధనమే పరమ చేదుగా మారుతుంది. మీకింకా నమ్మకం కుదరలేదా? అయితే ఈ పుస్తకం చదవండి.*

ఇందులో ధనవ్యామోహం, గ్లోబలైజేషన్, ఆర్థిక న్యాయం, వడ్డీ, దళారీవ్యవస్థ, వ్యాపారం, షేర్‌మార్కెట్, ఇస్లామిక్ మార్కెట్, జకాత్, ఆస్తిపంపిణీ, సమరసొత్తు, వీలునామా వగైరా శీర్షికలు ఉన్నాయి.

రచన: అబుల్ ఇర్ఫాన్, (పే:240, వెల: రూ110/–)

**ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్–2, ✆ 9441515414**

(అర్థం: సకల ప్రశంసలు, స్తోత్రాలు, ఆరాధనలు, పరిశుద్ధ విషయాలు దేవునికి మాత్రమే శోభిస్తాయి. ప్రవక్తా! మీపై శాంతి నెలకొనుగాక. దేవుని కారుణ్యం, ఆయన శుభాలు మీపై వర్షించుగాక. మాపై, సజ్జనులైన దైవదాసు లందరిపై శాంతి నెలకొనుగాక. అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ (స) ఆయన దాసుడు, సందేశహరుడని నేను సాక్ష్యమిస్తున్నాను.)

**దరూద్ :** "అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్వ్వ వఅలా ఆలి ముహమ్మదిన్ కమా సల్లయ్‌త అలా ఇబ్రాహీమ వఅలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్మజీద్. అల్లాహుమ్మ బారిక్ అలా ముహమ్మదిన్వ్వ అలా ఆలి ముహమ్మదిన్ కమా బారక్త అలా ఇబ్రాహీమ వఅలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్మజీద్."

(అర్థం: దేవా! ఇబ్రాహీంపై, ఆయన కుటుంబీకులు-సంబంధీకులపై ఎలా కారుణ్యం కురిపించావో అలాగే ముహమ్మద్‌పై, ఆయన కుటుంబీకులు-సంబంధీకులపై కూడా కారుణ్యం కురిపించు. నిస్సందేహంగా నీవే ప్రశంస నీయుడవు, మహత్తు గలవాడవు. దేవా! ఇబ్రాహీంకు, ఆయన కుటుంబీకులు-సంబంధీకులకు ఎలా శుభాలు ప్రసాదించావో అలాగే ముహమ్మద్‌కు, ఆయన కుటుంబీకులు-సంబంధీకులకు కూడా శుభాలు ప్రసాదించు. నిస్సందేహంగా నీవే ప్రశంసనీయుడవు, మహత్తు గలవాడవు.)

**దరూద్ తర్వాయి దుఆ :** "అల్లాహుమ్మ ఇన్నీఅవూజుబిక మిన్అజాబి జహన్నమ వమిన్ అజాబిల్ ఖబ్రి వ అవూజుబిక మిన్‌ఫిత్నతిల్ మసీహిద్దజ్జాలి వఅవూజుబిక మిన్‌ఫిత్నతిల్ మహ్‌యా వల్‌మమాతి అల్లాహుమ్మ ఇన్నీఅవూజు బిక మినల్‌మఅ్‌సమి వల్‌మగ్రిమ్."

(అర్థం: దేవా! నరక, సమాధి యాతనల నుండి, దజ్జాల్ ఉపద్రవం నుండి, జీవన్మరణాల పరీక్ష నుండి నేను నీ రక్షణ కోరుతున్నాను. దేవా! పాపాల బారినుండి, ప్రాణసంకటమైన రుణబాధ నుండి నీశరణు కోరుతున్నాను. మీపై శాంతి, దైవానుగ్రహాలు వర్షించుగాక.)



## 19. వేడుకోలు షరతులు

దుఆ చేయడమంటే అర్థించడం, ప్రార్థించడం, వేడుకోవడం, బ్రతిమాలడం, మొరపెట్టుకోవడం, విన్నవించుకోవడం అనే అర్థాలున్నాయి. ప్రతి విషయం లోనూ ఏ శక్తిస్వరూపుని అధీనంలో మన కష్టసుఖాలు, లాభనష్టాలున్నాయో ఆ అద్వితీయుడ్ని మాత్రమే వేడుకోవడం, మొరపెట్టుకోవడం జరగాలి. ఆ అద్వితీయుడు సృష్టికర్త, విశ్వప్రభువు అయిన అల్లాహ్ మాత్రమే. ఆయనే మన ఆపద్బాంధవుడు, ఆపదల మొక్కులవాడు. కనుక మానవులు తమ వేడుకోళ్లు, మొరలు, విన్నపాలు ఆ ఏకైక దేవునికే ప్రత్యేకించాలి.

✦ "నీవు ఏకాగ్రచిత్తుడవై ఈ ధర్మంలోనే స్థిరంగా ఉండు. బహుదైవారాధ కుల్లో చేరిపోకు. దేవుడ్ని వదలి నీకు ఎలాంటి లాభంగాని, నష్టంగాని కలిగించ లేని మిథ్యాదైవాలను ఎన్నటికీ ప్రార్థించకు. అలా చేస్తే నీవు దుర్మార్గుడవై పోతావు. దేవుడు నిన్ను ఏదైనా కష్టానికి గురిచేయదలిస్తే ఆయన తప్ప ఆ కష్టం నుండి నిన్ను గట్టెక్కించేవారెవరూ ఉండరు." (ఖుర్‌ఆన్-10:105,106)

✦ "నా దాసులు నా గురించి అడిగితే నేను వారికి చేరువలోనే ఉన్నానని చెప్పు. మొరపెట్టుకునేవాడు నన్ను మొరపెట్టుకుంటున్నప్పుడు నేనతని మొరాలకించి, దానికి సమాధానం ఇస్తానని కూడా చెప్పు. అయితే వారు నా సందేశం స్వీకరించి నా పట్ల పూర్తి విశ్వాసం కలిగివుండాలి. అప్పుడే వారు సన్మార్గం పొందగలరు." (ఖుర్‌ఆన్-2:186)

✦ "కొందరు దేవుడ్ని ప్రార్థిస్తూ "ప్రభూ! మాకు (నీవు ప్రసాదించేవన్నీ) ప్రపంచంలోనే ప్రసాదించు"అంటారు. అలాంటివారికి (ప్రపంచంలోనే తప్ప) పరలోక(స్వర్గ)ంలో ఎలాంటి వాటా లభించదు." (ఖుర్‌ఆన్-2:199)

✦ "మీరు నన్ను ప్రార్థించండి, నేను మీ ప్రార్థన స్వీకరిస్తాను. అహంకారం తో నన్ను ఆరాధించడానికి అంగీకరించనివారు నీచులయి నరకానికి పోతారు." (ఖుర్‌ఆన్-40:60)



దైవప్రవక్త (స) దేవుని మాటలను ఇలా తెలియజేశారు: "(విశ్వసనీయుడైన) నా దాసుడు నా గురించి ఏవిధమైన ఆశలు పెట్టుకుంటాడో ఆవిధంగానే నన్ను పొందుతాడు. నన్నతను స్మరిస్తున్నప్పుడు నేనతని వెంటే ఉంటాను. అతను నన్ను ఏకాంతంలో స్మరిస్తే నేను కూడా అతడ్ని ఏకాంతంలో స్మరిస్తాను. అతను నా గురించి ఏదైనా జనసమూహంలో ప్రస్తావిస్తే నేనతడ్ని గురించి జనసమూహం కంటే శ్రేష్ఠమైన (దైవదూతల) సమూహంలో ప్రస్తావిస్తాను. అతను నావైపు జానెడు దూరం కదిలివస్తే నేనతని వైపు బారెడు దూరం కదలివస్తాను. అతను నావైపు బారెడు దూరం వస్తే నేనతని వైపుకు నాలుగు బారెడల దూరం ఎదురువెళ్తాను. అతను నా వైపుకు నడచి వస్తే నేనతని వైపుకు పరుగెడుతూ వస్తాను." (బుఖారి, ముస్లిం)

కష్టసుఖాలు, లాభనష్టాలు, కీడు మేళ్ళు అన్నీ సృష్టికర్త, విశ్వపాలకుడైన దేవుని చేతిలోనే ఉన్నాయి. ఆయనే సర్వేశ్వరుడు, అసాధారణ శక్తిసంపన్నుడు. ఆయన తన దాసుల మొరలను ఎలాంటి మధ్యవర్తులు లేకుండానే ప్రత్యక్షంగా వింటాడు; తాను తలచుకున్నవారికి సహాయం కూడా చేస్తాడు. కనుక మానవులు ఎట్టి పరిస్థితులు ఎదురైనా ఆయన్నే వేడుకోవాలి.

ఈ కార్యకారణ ప్రపంచంలోని సహజ వనరులు, సాధనసంపత్తులేవీ ఒక్కోసారి దాసుల కష్టాలు దూరంచేయలేవు, వారి అవసరాలు తీర్చలేవు. అప్పుడు దాసులు అసాధారణ శక్తిసంపన్నుడి (Super Natural Power) ని వేడుకోవడానికి సిద్ధమవుతారు. ఆ అసాధారణ శక్తిసంపన్నుడు, సృష్టికర్త, సర్వేశ్వరుడైన దేవుడే. ఆయన్ని వదలి సృష్టితాలను వేడుకునేవారు ప్రపంచంలో తాత్కాలిక ప్రయోజనం పొందగలిగినా ఘోరపాపానికి పాల్పడిన వారవుతారు. నిజమైన విశ్వాసమున్న ముస్లింలు ఆయన్నే వేడుకుంటారు. అయితే వేడుకునేవారు తమ భౌతికప్రయత్నాలతో పాటు ఈక్రింది ప్రవక్త ప్రవచనాలు కూడా గమనించాలి:

☸ "నమాజ్ చేసేవాడా! నీవు దుఆ చేయడానికి సిద్ధమైనపుడు ముందుగా



దేవుడ్ని స్తుతించు. తరువాత నా కోసం దరూద్ పఠించు. ఆ తర్వాత (నీవు తలచుకున్న) దుఆ చేసుకో." (తిర్మిజి, అబూదావూద్, నసాయి)

☸ "ఒక ముస్లిం పాపకార్యానికి లేదా బంధువుల పట్ల నిర్దయకు సంబంధించిన విషయంలో గాకుండా మరేదైనా విషయంలో దుఆ చేసి నప్పుడు దేవుడు అతని దుఆను మూడురూపాల్లో ఏదోఒక రూపంలో స్వీకరిస్తాడు. అతని దుఆను ఇహలోకంలోనే స్వీకరిస్తాడు; లేదా అతనికి పరలోకంలో ప్రతిఫలం ఇవ్వడానికి దాన్ని భద్రపరుస్తాడు లేదా ఆ దుఆలోని విషయానికి సమానస్థాయిగల ఏదైనా ఆపదను అతని మీద పడకుండా నిరోధిస్తాడు." (ముస్నద్ అహ్మద్)

☸."దుఆ (ప్రార్థన)ను దేవుడు తప్పకుండా స్వీకరిస్తాడన్న గట్టి నమ్మకం తో చేయాలి." (తిర్మిజి)

☸."మనిషి తొందరపాటుతో 'నేను ఎంతో వేడుకున్నాను, చాలాసార్లు వేడుకున్నా. కాని నావేడుకోలు స్వీకరించబడే సూచనలు కానరావడం లేదు' అని చెప్పి అలసిపోయి వేడుకోవడం మానేస్తాడు. అలాంటి తొందరపాటు పనికిరాదు." (ముస్లిం)

☸."మీలో ప్రతి వ్యక్తీ తన అవసరాల కోసం దేవుడ్ని వేడుకోవాలి. చివరికి తన చెప్పువారు తెగిపోయినా సరే (దానికోసం కూడా) దేవుడ్ని వేడుకోవాలి." (తిర్మిజి)

☸."ఒకతను సుదూరప్రయాణం చేసి దుమ్ము-ధూళి కొట్టుకొని వస్తాడు. అతను ఆకాశం వైపు చేతులెత్తి 'ప్రభూ! ప్రభూ!' అంటూ ప్రార్థిస్తాడు. కాని అతను తిన్నది అధర్మమైన తిండి, అతను కట్టుకున్నవి అధర్మవస్త్రాలు, అతని శరీరం అధర్మ సంపాదనతో పోషించబడింది. అలాంటప్పుడు అతని ప్రార్థన ఎలా స్వీకరించబడుతుంది?" (ముస్లిం)

# 20. ఖుర్‌ఆన్ దుఆలు

ఖుర్‌ఆన్‌లో భావగర్భితమైన, సమగ్రమైన 'దుఆ'లున్నాయి. నమాజ్ తర్వాత వీటిని పఠించడం మంచిది. ఇతర సమయాల్లోనూ పఠించవచ్చు.

(1) "రబ్బనా ఆతినా ఫిద్దున్యా హసనతన్వ్వ ఫిల్‌ఆఖిరతి హసనతన్ వ్వఖినా అజాబన్నార్." (2:201)

(భావం: ప్రభూ! మాకు ఇహలోకంలోనూ, పరలోకంలోనూ మంచిని ప్రసాదించు. మమ్మల్ని నరకయాతనల నుండి రక్షించు.)

(2) "రబ్బనా లాతు అఖిజ్‌నా ఇన్నసీనా ఔ అఖ్‌తానా. రబ్బనా వలా తహ్‌మిల్ అలైనా ఇస్రన్ కమాహమల్‌తహూ అలల్లజీన మిన్‌ఖబ్‌లినా. రబ్బనా వలాతుహమ్మిల్నా మాలాతాఖతలనా బిహ్. వఅ్‌ఫుఅన్నా వగ్‌ఫిర్‌లనా వర్‌హమ్నా అన్తమౌలానా ఫన్‌సుర్నా అలల్ ఖౌమిల్‌కాఫిరీన్." (2:286)

(భావం: ప్రభూ! మేము మరచిపోయి ఏదైనా పొరపాటు చేసివుంటే దాన్ని పట్టుకోకు. మా గతప్రజలపై మోపినభారం మాపై మోపకు. ప్రభూ! మేము మోయలేని భారం మామీద వేయకు. మాపట్ల మృదువుగా ప్రవర్తించు. మా పొరపాట్లు పట్టించుకోకు. మమ్మల్ని క్షమించు,కనికరించు. నీవే మాస్వామివి సంరక్షకుడివి. అవిశ్వాసులకు వ్యతిరేకంగా మాకు సహాయంచెయ్యి.)

(3) "రబ్బనా ఇన్ననా ఆమన్నా ఫగ్‌ఫిర్లనా జునూబనా వఖినా అజా బన్నార్." (3:16)– (భావం: ప్రభూ! మేము (నిన్ను, నీప్రవక్తను) విశ్వసిం చాము. మా తప్పులు మన్నించు. మమ్మల్ని నరకాగ్ని నుండి రక్షించు.)

(4) రబ్బనా లాతుజిగ్ ఖులూబనా బఅ్‌ద ఇజ్‌హదైతనా వహబ్‌లనా మిన్‌ల్లదున్క రహ్మతన్. ఇన్నక అన్తల్ వహ్హాబ్. రబ్బనా ఇన్నక జామివున్నాసి లియౌమిల్ ల్లారైబ ఫీహ్. ఇన్నల్లాహ లాయుఖ్లిఫుల్ మీఆద్." (3:8,9)– (భావం: ప్రభూ! నీవు మాకు (ఒకసారి) సన్మార్గం చూపిన తరువాత తిరిగి మా హృదయాల్ని వక్రమార్గం వైపుకు పోనివ్వకు. నీ సన్నిధి నుండి మాకు



కారుణ్యం ప్రసాదించు. నీవే గొప్ప (కారుణ్య)ప్రదాతవు. ప్రభూ! ఒకరోజు నీవు మానవులందర్నీ సమావేశ పరచనున్నావు. ఆరోజు తప్పకుండా వస్తుంది. దేవుడు తన వాగ్దానాన్ని ఎన్నటికీ మీరడు.)

(5) "రబ్బనా హబ్‌లనా మిన్ అజ్‌వాజినా వ జుర్రియ్యాతినా ఖుర్రత అఅ్‌యునివ్వజ్‌అల్‌నా లిల్‌ముత్తఖీన ఇమామా." (25:74)– (భావం: ప్రభూ! మా భార్యాపిల్లల ద్వారా మా కంటికి చలువ ప్రసాదించు. మేము దైవభీతిపరులకు నాయకులయ్యేలా చెయ్యి.)

(6) "రబ్బనగ్ ఫిర్‌లనా వ లిఇఖ్‌వాని నల్లజీన సబఖూనా బిల్‌ఈమాని వలాతజ్‌అల్ ఫీఖులూబినా గిల్లన్‌ల్లిల్లజీన ఆమనూ రబ్బనా ఇన్నక రవూఫు ర్రహీమ్." (59:10)– (భావం: ప్రభూ! మమ్మల్ని, మాకు పూర్వం విశ్వసించిన మా సోదరులందర్నీ క్షమించు. (యావత్తు) విశ్వాసుల పట్ల మా హృదయాల్లో ఎలాంటి అసూయాద్వేషాలు ఉంచకు. ప్రభూ! నీవు గొప్ప


ఫుర్‌ఖాన్ భావామృతం




**శ్రమ నాది, ప్రతిఫలం మీది**

ఎవరైనా ఫుర్ఖాన్ భావామృతంతో పాటు ఖుర్‌ఆన్ భావామృతం కూడా దగ్గర పెట్టుకుంటే వారు ఖుర్‌ఆన్ జ్ఞానార్జన కోసం తోటకు వెళ్ళి, చెట్టెక్కి, పండు కోసి, తోలు తీసి తినవలసినంత శ్రమ పడ వలసిన అవసరముండదు; తోలు వలచిన పండు చేతిలో ఉన్నట్లే భావిస్తారు. ఆ శ్రమంతా రచయితే నెత్తి మీద వేసుకొని పాఠకులకు 'రెడీమేడ్' జ్ఞానం అందజేయడానికి శాయాశక్తులా కృషిచేశాడు.

కూర్పు: అబుల్ ఇర్ఫాన్, (పే:560, వెల:రూ200/–)

**ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్–2, ✆ 9441515414**




క్షమాశీలివి, అపార దయామయుడవు.)

(7) "రబ్బనా అలైక తవక్కల్‌నా వఇలైక అనబ్‌నా వఇలైకల్ మసీర్. రబ్బనా లాతజ్‌అల్‌నా ఫిత్నతన్ ల్లిల్లజీనా కఫరూ వగ్‌ఫిర్‌లనా రబ్బనా. ఇన్నక అన్తల్ అజీజుల్‌హకీమ్." (60:4,5) (భావం: ప్రభూ! మేము నిన్నే నమ్ము కున్నాం. నీవైపుకే మరలాము. మేము నీసన్నిధికే రావాలి. ప్రభూ! మమ్మల్ని అవిశ్వాసుల కోసం పరీక్షగా చేయకు. ప్రభూ! మా తప్పులు మన్నించు. నీవే అపార శక్తిసంపన్నుడవు, అసామాన్య వివేకవంతుడవు.)

(8) "రబ్బనా ఆమన్నా ఫగ్‌ఫిర్‌లనా వర్‌హమ్‌నా వఅన్త ఖైరుర్రాహిమీన్." (23:109) (భావం: ప్రభూ! మేము విశ్వసించాం. మమ్మల్ని క్షమించు. మా మీద దయజూపు. నీవు దయామయుల్లో కెల్లా గొప్ప దయామయుడవు.)

(9) "రబ్బి అవ్‌జిఅ్‌నీ అన్‌అష్‌కుర నిఅ్‌మతకల్లతీ అన్‌అమ్త అలయ్య వఅలా వాలిదయ్య వఅన్ అఅ్‌మల సాలిహన్ తర్‌జాహు వఅస్లిహ్‌లి ఫీ జుర్రియ్యతి. ఇన్నితుబ్తు ఇలైక వఇన్ని మినల్‌ముస్లిమీన్."(46:15)

(భావం: ప్రభూ! నీవు నాకు, నా తల్లిదండ్రులకు చేసిన మేళ్ళకు నేను నీపట్ల కృతజ్ఞుణ్ణయివుండే సద్బుద్ధి ప్రసాదించు. నీ ప్రసన్నతాభాగ్యం లభించే టటువంటి సత్కార్యాలుచేసే సద్బుద్ధి కూడా ప్రసాదించు. నా సంతానాన్ని కూడా సజ్జనులుగా చేసి నాకు సుఖాన్నివ్వు. నేను నీకు విధేయుణ్ణయిన దాసుడ్ని. నా పాపాలకు నేను పశ్చాత్తాపపడుతూ నన్ను క్షమించమని నీ సన్నిధిలో వేడుకుంటున్నాను.)

(10) రబ్బిష్‌రహ్‌లీ సద్‌రీ వయస్సిర్‌లీ అమ్రీవహ్‌లుల్ ఉఖ్‌దత మ్మిన్‌ల్లిసాని యఫ్‌ఖహూ ఖౌలి." (20:25–28)

(భావం: ప్రభూ! నాకు మనోస్థయిర్యం ప్రసాదించు. నా పనులు సులభంగా నెరవేరేలా చెయ్యి. ప్రజలు నామాట గ్రహించడానికి వీలుగా నాకు (మంచి) వాక్పటిమ ప్రసాదించు.) 卐



# 21. హదీస్ దుఆలు

**ఉదయం–సాయంత్రం చేసే దుఆ:** "అల్లాహుమ్మ బిక అస్‌బహ్‌నా వబిక అమ్‌సైనా వబిక నహ్‌యా వబిక నమూతు వఇలైకల్ మసీర్." (తిర్మిజి)– (భావం: దేవా! మాకు నీసహాయం వల్లనే తెల్లవారింది. నీ సహాయంవల్లనే సాయంత్రమయింది. నీసహాయంతోనే మేము జీవిస్తున్నాం. నీఆజ్ఞతోనే మరణిస్తాం. చివరికి మేము నీదగ్గరికే తిరిగిరావలసి ఉంది.)

**ఆపదలో చేసే దుఆ:** "ఇన్నాలిల్లాహి విఇన్నాఇలైహి రాజివూన్, అల్లా హుమ్మ అజర్నీ ఫీముసీబతి వఖ్‌లుఫ్‌లి ఖైరన్మ్మిన్‌హా." (ముస్లిం)– (భావం: మేము దేవునికే చెందినవాళ్ళం. ఆయన దగ్గరికే పోవలసినవాళ్ళం. దేవా! నాఆపదలో పుణ్యం కల్గించి తద్వారా నాకు మంచిప్రతిఫలం ప్రసాదించు.)

**రాత్రి పడుకోబోయే ముందు చేసే దుఆ :** రాత్రి పడుకోడానికి ఉపక్ర మించినప్పుడు మొదట పడకను మూడు సార్లు విదిలించి శుభ్రపరచుకొని


ముస్లిం మహిళ




**కొడ్తే ఏడుస్తుంది! కొట్టకపోతే ఎగబడ్తుంది!**

*మరేం చేయాలి? ఈ సమస్యకు పరిష్కారం కావాలంటే ఈ పుస్తకం చదివి తీరాల్సిందే.*

ఇందులో వివాహం, భార్యాభర్తల బాధ్యతలు, అత్తా కోడళ్ళ గొడవలు, పరదా, వస్త్రధారణ, విడాకులు, మనోవర్తి, ఆర్థికహక్కులు, లింగవివక్ష, సంతానశిక్షణ, ముస్లిం పర్సనల్ లా, ముస్లిం మహిళ గుణగణాలు, కాంతామణులే కింగ్‌మేకర్స్, స్త్రీల ఆంతరంగిక విషయాలు వగైరా శీర్షికలు ఉన్నాయి.

రచన: తాహిరా తన్వీర్, (పే:256, వెల:రూ125/–)

**ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్–2, ✆ 9441515414**

కుడిచెంప కింద చేయి పెట్టుకొని పడుకోవాలి. తరువాత 33 సార్లు 'సుబ్‌హానల్లాహ్, 33 సార్లు 'అల్‌హమ్దులిల్లాహ్, 34 సార్లు 'అల్లాహుఅక్బర్' అని పఠించాలి. ఆ తరువాత ఈ దుఆ పఠించాలి– "అల్లాహుమ్మ బిస్మిక రబ్బీ వజఅ్‌తు వఅహ్‌యా." (బుఖారి)– (భావం: దేవా! నేను నీ పేరుతోనే మరణిస్తాను, నీ పేరుతోనే జీవిస్తాను.)

ప్రవక్త–స హితోక్తి: "నీవు పడకపై మేనువాల్చినప్పుడు ఈ దుఆ పఠించు:

"అల్లాహుమ్మ అస్లమ్తు నఫ్సీ ఇలైక, వ వజ్జహ్తు వజ్‌హీ ఇలైక, వ ఫవ్వత్తు అమ్రీ ఇలైక, వ అల్‌జాతు జహ్‌రీ ఇలైక, రగ్‌బతన్ వ రహ్‌బతన్ ఇలైక, లా మల్జఅ వలా మన్జా మిన్‌క ఇల్లా ఇలైక, ఆమన్తు బికితాబికల్లజీ అన్జల్త, వ నబియ్యికల్లజీ అర్సల్త."

(భావం: దేవా! నన్ను నేను నీకు సమర్పించుకున్నాను. నా ముఖం నీ వైపుకు తిప్పుకున్నాను. నా వ్యవహారాలన్నీ నీకు అప్పగించాను. నీ అనుగ్రహాన్ని కోరుకుంటూ, నీ ఆగ్రహానికి భయపడుతూ నీ శరణుజొచ్చాను. నీవు ఆశ్రయమిస్తే తప్ప మరెక్కడా ఆశ్రయం లేదు. నీవు రక్షణ కల్పిస్తే తప్ప రక్షణ పొందటానికి మరోచోటు లేదు. నేను నీవు పంపిన గ్రంథాన్ని విశ్వసించాను. నీవు పంపిన ప్రవక్తను కూడా నమ్మాను.)

ఈ దుఆ పఠించి నిద్రపోయినప్పుడు అదేరాత్రి మరణిస్తే, నీవు సహజత్వం (ఇస్లాం)పై మరణించినట్లు పరిగణించబడతావు. ఒకవేళ తెల్లవారిన తరువాత బతికివుంటే అప్పుడూ నీకు శుభం కలుగుతుంది. (బుఖారీ, ముస్లిం)

**నిద్ర పట్టనప్పుడు చేసే దుఆ :**"అల్లాహుమ్మ గారతిన్నుజూము వహదఅ్‌తిల్ ఉయూను వఅన్తహయ్యున్ ఖయ్యూమున్ లాతాఅ్‌ఖుజుక సిన తున్‌వ్వలానౌమున్ యాహయ్యు యాఖయ్యూము ఇహ్‌దిలైలి వఅనిమ్‌ఐని."

(భావం: దేవా! నక్షత్రాలు అస్తమిస్తున్నాయి. కళ్ళు మందుతున్నాయి. నీవు నిత్యజీవుడవు. నీకు నిద్ర రాదు, తూగూ రాదు. నిత్యజీవుడా! ఈరాత్రి నాకు



సుఖం ప్రసాదించు. నా కళ్ళకు నిద్ర కలిగించు.)

**మరుగుదొడ్డికి వెళ్ళేముందు చేసే దుఆ :** "అల్లాహుమ్మ ఇన్నీ అవూజుబిక మినల్‌ఖుబుసి వల్‌ఖబాయిస్." (ముత్తఫఖున్‌అలై)– (అర్థం: దేవా! అపవిత్రమైన షైతానుల బారినుండి నేను నీ శరణుగోరుతున్నాను.)

**మరుగుదొడ్డి నుండి బయటికొచ్చిన తర్వాత చేసే దుఆ:** "అల్లాహుమ్మ గుఫ్‌రానక" (అర్థం: దేవా! నేను నీనుండి క్షమాభిక్ష అర్థిస్తున్నాను.)

**మస్జిద్‌లో ప్రవేశించేటప్పుడు చేసే దుఆ:** "అల్లాహుమ్మఫ్ తహ్‌లీ అబ్వాబ రహ్మతిక." (కుడికాలు మస్జిద్‌లో పెడ్తూ ఈ దుఆ పఠించాలి– ముస్లిం)– (అర్థం: దేవా! నాకోసం నీ కారుణ్యద్వారాలు తెరువు.)

**మస్జిద్ నుండి బయటికి వెళ్ళేటప్పటి దుఆ:** "అల్లాహుమ్మ ఇన్నీ అస్ అలుక మిన్ ఫజ్‌లికల్ అజీమ్." (ఎడంకాలు బయటపెడ్తూ పఠించాలి)

శాంతి
సమరం
న్యాయం



**శాంతి కావాలంటే దౌర్జన్యపరులకు వ్యతిరేకంగా సమరభేరి మోగించాల్సిందే! శాంతి పరిరక్షణ కోసం న్యాయవంతమైన పాలనావ్యవస్థే శరణ్యం.**

*ఇస్లాం వెలుగులో వీటి వివరాలు తెలుసుకోదలచిన వారు ఈ పుస్తకం తప్పకుండా చదవాలి.*

ఇందులో శాంతికి అసలైన సోర్స్, మానవుని జీవిత పరమార్థం, శాంతి ఉద్యమం ప్రారంభదశ, యుద్ధ ఘట్టాలు, శ్రేష్ఠ సమాజం, ఇస్లాంలో న్యాయవ్యవస్థ, నేరవిచారణ విధానం వగైరా శీర్షికలు ఉన్నాయి.

రచన: అబుల్ ఇర్ఫాన్, (పే:224, వెల: రూ100/–)

**ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్–2, ✆ 9441515414**



(అర్థం: దేవా! నేను నీ మహత్తరమైన అనుగ్రహాన్ని అర్థిస్తున్నాను.)

**ఇంటి నుండి బయలుదేరేటప్పుడు చేసే దుఆ:** 'బిస్మిల్లాహి తవక్కల్తు అలల్లాహి, వలాహౌల వలాఖువ్వత, ఇల్లాబిల్లాహి" (భావం:– నేను దేవుని పేరుతో ప్రారంభిస్తున్నాను. నేను ఆయన్నే నమ్ముకున్నాను. పాపాలకు దూరంగా ఉండాలన్నా, మంచిపనులు చేయాలన్నా ఆయన శక్తివల్లనే సాధ్య మవుతుంది) అని పఠించి బయలుదేరినప్పుడు ఆ వ్యక్తితో "నీవు సన్మార్గం పొందావు, నీకు సహాయం కల్పించబడింది, నీవు రక్షించబడ్డావు" అని అదృశ్యవాణి ఎవరికీ వినపడని విధంగా పలుకుతుంది. అంతేకాదు, షైతాన్ కూడా అలాంటి మనిషి నుండి దూరంగా పారిపోతాడు. (అబూదావూద్)

**వాహనం ఎక్కేటపుడు చేసే దుఆ:** "సుబ్‌హానల్లజీ సఖ్ఖరలనా హాజా వమాకున్నా లహూ ముఖ్‌రినీన వఇన్నా ఇలా రబ్బినా లమున్‌ఖలిబూన్."

భావం: మాకోసం వీటిని అదుపులో ఉంచిన దేవుడు ఎంతో పవిత్రుడు. మేము వీటిని అదుపులో పెట్టగల శక్తిమంతులం కాము. ఒకరోజు మేము మా ప్రభువు దగ్గరికి మరలిపోవలసి ఉంది." (ఖుర్‌ఆన్–43:13,14)

**వివిధ కీడులనుండి రక్షణకోసం చేసే దుఆ:** "అల్లాహుమ్మ ఇన్నీ అవూజుబిక మిన్ అజాబిల్‌ఖబ్రి వఅవూజుబిక మిన్ ఫిత్నతిల్ మసీహిద్దజ్జాలి వఅవూజుబిక మిన్ ఫిత్నతిల్ మహ్‌యా వల్‌మమాతి, అల్లాహుమ్మ ఇన్నీ అవూజుబిక మినల్ మాసమి వల్ మగ్‌రమి." (ముత్తఫఖున్ అలై)

భావం: దేవా! నేను సమాధి యాతనల నుండి నీ శరణుగోరుతున్నాను. దజ్జాల్ ఉపద్రవం నుండి, జీవన్మరణాల పరీక్షల నుండి నీ శరణు గోరు తున్నాను. దేవా! నేను పాపాల బారినుండి, రుణభారం నుండి కూడా నీ శరణుగోరుతున్నాను." (బుఖారి)

**శ్మశానానికి వెళ్ళినపుడు చేసే దుఆ:** "అస్సలాము అలైకుమ్ అహ్‌ల ద్దియారి మినల్ ముఅ్‌మినీన వల్‌ముస్లిమీన వఇన్న ఇన్‌షాఅల్లాహు బికుమ్



లాహిఖూన నస్‌అలుల్లాహ లనా వలకుముల్ ఆఫియత." (ముస్లిం)

(భావం: విశ్వాసులు, ముస్లిములైన సమాధివాసులారా! మీకు శాంతి కలుగుగాక. దైవచిత్తమైతే మేమూ (ఓరోజు) మిమ్మల్ని కలుసుకుంటాము. మేము మనందరి కోసం అల్లాహ్‌ను క్షేమం కోరుతున్నాం.)

**భోజన సమయంలో చేసే దుఆలు:** "బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీం" (కరుణామయుడు, కృపాసాగరుడైన అల్లాహ్ పేరుతో) అని చెప్పి భోజనం ప్రారంభించాలి. భోజనం ముగిసిన తర్వాత "అలహమ్దు లిల్లహిల్లజీ అత్ ఆమని హాజా వరజఖనీహి మిన్‌గైరి హౌలిమ్మిన్ని వలాఖువ్వతి." అని పఠించాలి. (భావం: నాకీ ఆహారం తినిపించిన దేవునికి కృతజ్ఞతలు. నా శక్తిసామర్థ్యాల ప్రమేయం లేకుండానే ఆయన నాకు దీన్ని ప్రసాదించాడు.)

దైవప్రవక్త (స) హితోక్తి: "భోజనం చేసి దానిపై దేవునికి కృతజ్ఞతలు తెలుపుకునేవాడి పట్ల, నీళ్ళు తాగి దానిపై దేవుణ్ని స్తుతించే దాసుడి పట్ల దేవుడు అమితంగా ప్రసన్నుడౌతాడు." (ముస్లిం)

**కొత్తబట్టలు ధరించేటపుడు చేయవలసిన దుఆ:** "అల్లాహుమ్మ లకల్ హమ్దు అన్తకసౌ తనీహి అస్‌అలుక ఖైరహూవఖైర మాసునిఅ లహూ వ అవూజుబిక మిన్‌షర్రి మాసునిఅ లహూ." (తిర్మిజి)

(భావం: దేవా! సకల విధాల ప్రశంసలు నీకే శోభిస్తాయి. నీవే నాకీ బట్ట ధరింపజేశావు. ఈ బట్ట శ్రేయోశుభాలను, దేని కోసం ఇది తయారు చేయబడిందో దాని శ్రేయోశుభాలను నీ నుండి అర్థిస్తున్నాను.)

**భార్యాభర్తల కలియకకుముందు చేసేదుఆ:** "బిస్మిల్లాహి అల్లాహుమ్మ జన్నిబ్‌న షైయ్‌తాని వజన్నిబి షైయ్‌తాన మారజఖ్తనా." (అర్థం: దేవుని పేరుతో ప్రారంభం. దేవా! మమ్మల్ని షైతాన్ కీడునుండి కాపాడు)

**ఓ సమగ్రమైన దుఆ:** దైవప్రవక్త (స) ఇలా ప్రార్థించేవారు: "దేవా! దీనావస్థ నుంచి, సోమరితనం నుంచి, పిసినారితనం నుంచి, నికృష్టమైన

వృద్ధాప్యం నుంచి, సమాధియాతన నుంచి, నేను నీశరణు వేడుతున్నాను. దేవా! నా మనసుకు భయభక్తులు అనుగ్రహించు. దీన్ని శుద్ధిచేయి. నీవు మనసుని అందరికంటే బాగా శుద్ధిచేస్తావు. దాని కార్యసాధకుడివి, సంరక్ష కుడివి నీవే. దేవా! పనికిమాలిన విద్య నుండి నీశరణు వేడుతున్నాను. భయపడని హృదయం నుండి, తృప్తిచెందని మనసు నుండి, ఆమోదించ బడని ప్రార్థన నుండి నీ శరణు వేడుతున్నాను." (ముస్లిం)

**రోగాల నుండి శరణు:** దైవప్రవక్త (స) ఇలా ప్రార్థించేవారు: "దేవా! తెల్లమచ్చల రోగం నుండి, పిచ్చితనం నుండి, కుష్ఠువ్యాధి నుండి, ఇతర నీచమైన రోగాల నుండి నేను నీశరణు వేడుతున్నాను." (అబూదావూద్)

**గమనార్హమైన విషయాలు:** దైవప్రవక్త (స) హితోక్తి– "మనిషి సాష్టాంగ ప్రణామం (సజ్దా) స్థితిలో తన ప్రభువుకు అత్యంత దగ్గరవుతాడు. కనుక (ఆ స్థితిలో) ఎక్కువగా దుఆ (ప్రార్థన)లు చేయండి." (ముస్లిం)

ఒకతను దైవప్రవక్త (స)ను "ఏ ప్రార్థన ఎక్కువగా స్వీకరించబడుతుంది?" అని అడిగాడు. దానికాయన "రాత్రి చివరిజాములో ఫర్జ్ నమాజుల తర్వాత (చేసే) ప్రార్థన (ఎక్కువగా స్వీకరించబడుతుంది)" అని చెప్పారు. (తిర్మిజీ)

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఏ ముస్లిం దాసుడయినా తన సోదరుని పరోక్షంలో అతని శ్రేయస్సు కోసం ప్రార్థించినప్పుడు, ఒక దైవదూత 'నీక్కూడా అలాగే జరుగుగాక!' అని దీవిస్తాడు." (ముస్లిం)

ప్రవక్త(స) హితోక్తి: "మేలు చేసినవారి కోసం 'జజాకల్లాహు ఖైరా' (దేవుడు నీకు మంచిప్రతిఫలం ఇవ్వుగాక!) అని ప్రార్థిస్తే, వారిని పొగిడినట్లే." (తిర్మిజీ)

హజ్రత్ ఉమర్ (రజి) కథనం: "దైవప్రవక్త (స) 'దుఆ' కోసం చేతులు ఎత్తిన తరువాత అరచేతులతో ముఖం స్పర్శించుకునేదాకా చేతులు దించే వారుకాదు." (తిర్మిజి)



## 22. మరువరాని మాటలు

"ఏడు రకాల అవస్థలు దాపురించకముందే మంచిపనులు చేయడానికి త్వరపడండి. మీరు (ధర్మాన్ని) మరచిపోయేలా చేసే పేదరికం కోసం ఎదురు చూస్తున్నారా? హద్దుమీరి ప్రవర్తించేలాచేసే కలిమి కోరుకుంటున్నారా? ఆరోగ్యం పాడుచేసే రోగం కోసం ఎదురుచూస్తున్నారా? లేక బుద్ధి–వివేకాల్ని పోగొట్టే వృద్ధాప్యం కోసం ఎదురుచూస్తున్నారా? లేక తృటిలో ప్రాణం తీసే చావుకోసం ఎదురుచూస్తున్నారా? లేక కనిపించని కీడుల్లో అత్యంత హానికర మైన దజ్జాల్ రాకకోసం ఎదురుచూస్తున్నారా? లేక ప్రళయం కోసం ఎదురు చూస్తున్నారా? ప్రళయమైతే ఎంతో భయంకరమైనది, చేదైనది." (తిర్మిజీ)

"రెండు వరాలున్నాయి. వాటి దుర్వినియోగం వల్ల అనేకమంది నష్ట పోతున్నారు. అవి– ఆరోగ్యం, తీరిక." (బుఖారీ)

"దేవుడు మనిషిని అరవైయేండ్ల దాకా బ్రతికుండేటట్లు అతని మరణాన్ని వాయిదావేస్తే ఇక అతని కోసం ఎలాంటి సాకులు వదలనట్లే." (బుఖారీ)

"భయపడినవాడు తెల్లవారకముందే బయలుదేరుతాడు. తెల్లవారకముందే బయలుదేరినవాడు గమ్యానికి చేరుకుంటాడు. వినండి! అల్లాహ్ బేరం ఎంతో విలువైనది. జాగ్రత్తగా వినండి! అల్లాహ్ బేరమంటే స్వర్గమే!" (తిర్మిజీ)

"దేవునికి రెండు బొట్లు, రెండు మచ్చల కన్నా ఎక్కువ ప్రియమైన వస్తువు మరేదీ లేదు. ఒకటి, దైవభీతి మూలంగా రాలిన కన్నీటి బొట్టు. రెండు, దైవ మార్గంలో (పోరాడినప్పుడు) చిందే రక్తపుబొట్టు. పోతే రెండు మచ్చల్లో ఒకటి, దైవమార్గంలో పోరాడినప్పుడు (కలిగిన గాయంవల్ల) ఏర్పడిన మచ్చ. రెండు, ఏదైనా దైవవిధిని నిర్వర్తించినప్పుడు కలిగిన మచ్చ." (తిర్మిజీ)

"మీరు మీకన్నా తక్కువస్థితిలో ఉన్నవారివైపు చూడండి. మీకన్నా ఉచ్ఛస్థితిలో ఉన్నవారివైపు చూడకండి. దేవుడు మీకు ప్రసాదించిన అనుగ్రహాల పట్ల మీరు కృతజ్ఞతాభావంతో ఉండటానికి ఇదెంతో మంచిపద్ధతి." (బుఖారీ)



"మనిషి చనిపోయిన తరువాత మూడు విధాల కర్మలు తప్ప మిగిలిన కర్మలన్నీ అంతమయిపోతాయి. ఆ మూడు కర్మలు ఇవి– 1–నిరంతర దానం (సదఖాయెజారియా), 2–ఎల్లప్పుడూ ప్రయోజనం చేకూర్చే విద్య, 3–మృతుని కోసం దైవాన్ని ప్రార్థించే మంచి సంతానం." (ముస్లిం)

"నా ప్రభువు నన్ను తొమ్మిది విషయాలను గురించి ఆదేశించాడు. 1–రహస్యంగానైనా, బహిరంగంగానైనా ఎట్టి పరిస్థితిలోనూ దేవునికి భయ పడాలి. 2–కోపంగాఉన్నా, సంతోషంగాఉన్నా సరే సత్యమే మాట్లాడాలి. 3–పేదరికంలోనూ, ఐశ్వర్యంలోనూ మధ్యేమార్గం అవలంబించాలి. 4–నాపట్ల నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించినవాని పట్ల నేను దయాదాక్షిణ్యాలతో ప్రవర్తించాలి. 5–నాకివ్వకుండా అడ్డుకున్నవానికి నేను ఇవ్వాలి. 6–నాపై దౌర్జన్యం చేసిన వాడ్ని నేను క్షమించాలి. 7–నా మౌనం చింతనై, నా పలుకులు దైవధ్యానమై ఉండాలి. 8–నా దృష్టి గుణపాఠం గ్రహించేదిగా ఉండాలి. 9–నేను మంచిని గురించి ప్రజలను ఆదేశించాలి." (తిర్మిజి)

"నమ్మక ద్రోహం సర్వసామాన్యమైన జాతిలో దేవుడు శత్రుభయం, బీభత్సా లను వ్యాపింపజేస్తాడు. వ్యభిచారం అంటువ్యాధిలా వ్యాపించిన సమాజం సర్వనాశనం కాకతప్పదు. తూనికలు కొలతల మోసం సర్వవ్యాప్తమై పోయిన సమాజం ఆహార శుభం కోల్పోతుంది. అన్యాయమైన తీర్పులు, నిర్ణయాలు జరిగే చోట రక్తపాతం జరిగితీరుతుంది. ఒప్పందం ఉల్లంఘించిన జాతిని శత్రువు తప్పకుండా జయిస్తాడు." (మిష్కాత్)

*'తేటతెలుగు'లో ఇస్లాం సంపూర్ణ స్వరూపం చూడదలచినవారికి ఇస్లామీయ సాహిత్యాన్ని సమగ్రమైన సిలబస్‌గా అందజేస్తున్న ఏకైక సంస్థ "ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్" (హైదరాబాద్–2) మాత్రమే. ఈ సిలబస్ ప్రకారం వెలువడ వలసిన 12 పుస్తకాలలో 10 పుస్తకాలు వెలువడ్డాయి. మిగిలిన 2 పుస్తకాలు కూడా దైవచిత్తమైతే త్వరలోనే వెలువడతాయి. ఆసక్తికలవారు ఫోన్ ద్వారా సంప్రదించి వివరాలు తెలుసుకో వచ్చు. ఫోన్: 944 1515 414.*



## సంక్షిప్త సమాచారం

1. ఖుర్ఆన్ అవతరణ (వహీ) ప్రారంభమైన తేదీ... క్రీ.శ.12-2-610, రమజాన్ నెల శుక్రవారం.
2. ఖుర్ఆన్ మొత్తం అవతరించిన కాలం...22ఏండ్లు, 5నెలలు, 14 రోజులు.
3. ఖుర్ఆన్‌లోని మొత్తం అధ్యాయాలు (సూరాలు).............114.
4. ఖుర్ఆన్‌లోని మొత్తం సూక్తులు (ఆయత్‌లు)..............6,236.
5. ఖుర్ఆన్‌లోని మొత్తం పదాలు...........................86,430.
6. ఖుర్ఆన్‌లోని మొత్తం అక్షరాలు.....................3,23,760.
7. దైవప్రవక్త (సల్లం)కు ఖుర్ఆన్ సందేశం (దివ్యావిష్కృతి) అందజేసిన దైవదూత.............హజ్రత్ జిబ్రీల్ (అలైహి)
8. మూడవఖలీఫా కాలం వ్రాతప్రతుల్లో నేటికీ సురక్షితంగా ఉన్న రెండు ప్రతులు... 1. తాష్కంట్ (రష్యా)లో, 2, ఇస్తాంబుల్ (టర్కీ)లో ఉన్నవి.
9. 'అల్లాహ్' పేరు ఖుర్ఆన్‌లో మొత్తం ఇన్నిసార్లు వచ్చింది.....2,697.
10. నూహ్‌ప్రవక్త (అలై) ప్రచారం చేసిన కాలం...950 ఏండ్లు (29:14).
11. మన తొలి ఆరాధనాదిశ (ఖిబ్లా)....మస్జిదుల్ అఖ్సా (బైతిల్‌మఖ్దిస్).
12. ఖుర్ఆన్‌లో నమాజ్ ప్రస్తావన ఇన్ని సార్లు వచ్చింది.........700.
13. గతగ్రంథాలను ఖురాన్ పేరుతో ప్రస్తావించిన సూరాలు...13,15
14. చెడుల జోలికి పోకుండా నిరోధించే సత్కార్యం...నమాజ్ (29:45).
15. దుర్భర (నరక)యాతనల నుండి కాపాడగలిగే వ్యాపారవిధానం ఈ అధ్యాయంలో ఉంది.....సఫ్ (సైనికపంక్తి–61:10,11)
16. "ఏ మతస్థులైనా దేవుణ్ని, అంతిమదినాన్ని విశ్వసించి, సత్కార్యాలు చేస్తే చాలు" అనేసూక్తి ఈ సూరాల్లో ఉంది......(2:62, 5:69).

**SUVARNA SOOKTULU**
(Golden Words of Islam)

# సువర్ణ సూక్తులు

కూర్పు: అబుల్ ఇర్ఫాన్

**ISLAMIC RESOURCE CENTRE**
**SAHARA COMPLEX, PATHARGATTI,**
**HYDERABAD-2, Ph: 944 1515 414**

Price................................................Rs.15/-

## IRC ప్రచురణలు

1. ఖుర్ఆన్ భావామృతం (సంపూర్ణం).......వెల: రూ. 300/-
2. మహనీయ ముహమ్మద్(స) ఆదర్శజీవితం: వెల: రూ. 200/-
3. పరలోక ప్రస్థానం...........................వెల: రూ. 110/-
4. ముస్లిం మహిళ..............................వెల: రూ. 125/-
5. ధన వికేంద్రీకరణ...........................వెల: రూ. 110/-
6. రమజాన్ ఆశయాలు........................వెల: రూ. 100/-
7. కాబా సందేశం...............................వెల: రూ. 100/-
8. శాంతి-సమరం-న్యాయం..................వెల: రూ. 100/-
9. ఫుర్ఖాన్ భావామృతం.......................వెల: రూ. 200/-
10. హదీస్ హితోక్తులు.........................వెల: రూ. 225/-
11. ఖుర్ఆన్ భావామృతం (30వ భాగం).....వెల: రూ. 20/-
12. శుభోదయం.................................వెల: రూ. 20/-
13. మసీహ్ మౌవూద్............................వెల: రూ. 25/-
14. సువర్ణ సూక్తులు.............................వెల: రూ. 15/-

**ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్-2**
**ఫోన్: 040-66710795, 944 1515 414**




## ఖుర్ఆన్ భావామృతం

- ☆ తేట తెలుగులో భావానువాదం
- ☆ ప్రతి సూరా అవతరణకు పూర్వపరాలు
- ☆ అవసరమైన మేరకే సమగ్ర వ్యాఖ్యానం
- ☆ సైన్సు, హదీసులతో మరింత విశదీకరణ
- ☆ విడిగా విశేష సంక్షిప్త సమాచారం
- ☆ రిఫరెన్సు కోసం ప్రత్యేక విషయదర్శిని

కూర్పు-భావానువాదం: అబుల్ఇర్ఫాన్, పే:912, వెల: రూ. 300/-

**"వార్త"** (22.5.05) **సమీక్ష:** ఖురాన్ అందరికీ అందుబాటులోలేని కాలంలో కొంతమంది స్వార్థపరులు ఖురాన్‌బోధనలను వక్రీకరించిన సంఘటనలు చరిత్రలో ఎన్నో కనబడతాయి. ప్రపంచంలోని మారుమూల ప్రాంతాలకు కూడా బైబిల్ అనువాదాలు చొరబడి నంత సులభంగా, వేగంగా ఖురాన్ చేరకపోవడం వల్ల చాలానష్టమే జరిగింది. ప్రాంతీయభాషలలో ఖురాన్ అనువాదాలు వెలువడకపోవడం వెనుక కొంత మంది స్వార్థపరుల ఆంక్షలు, అనవసర భయాలుకూడా ఒక కారణమనే చెప్పాలి. ఈ ప్రయత్నాల్లో భాగంగా వచ్చిన ప్రాంతీయఅనువాదాల్లో ముఖ్యంగా తెలుగులో గతంలో వచ్చిన అనువాదాలు కూడా సమగ్రంగా లేకపోవడం, గ్రాంథికంలో ఉండడంవల్ల ఎవరూ అంతగా పట్టించుకోలేదు.

ఇన్నాళ్ళకి తెలుగులో సులభ సుందరశైలిలో, అందరికీ అర్థమయ్యే విధంగా అనువదించడంలో అత్యంతప్రతిభ కనబరచిన అబుల్ఇర్ఫాన్ అభినందనీయుడు. ఖురాన్ అనువాదంలో ఎదురయ్యే ఇబ్బందులను, క్లిష్టతలను వివరించిన ముందుమాటల ద్వారా అనువాదకర్త నిజాయితీని, నిబద్ధతను గుర్తించగలం. ఈ పుస్తకాన్ని అరబిక్ లిపితో, దాని అనువాదంతో పాటు ఇచ్చిన పాదపీఠికలు విషయాన్ని సులభంగా వివరిస్తాయి. ఈ కృషి విజ్ఞానదాయకమైనది.

**-కె.పి. అశోక్ కుమార్ ('వార్త' దినపత్రిక-22.5.2005)**

పుస్తకం దొరికే చోటు: ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్-2




## మహనీయ ముహమ్మద్(స) ఆదర్శ జీవితం

- ☆ మొదలుపెడితే ముగించేదాకా వదలిపెట్టలేని **ధారావాహిక నవలా స్రవంతి**
- ☆ విషయాలు ప్రామాణిక గ్రంథాల నుండి సేకరణ
- ☆ సందర్భోచితంగా ఖుర్ఆన్ సూక్తులతో వివరణ

రచన: అబుల్ఇర్ఫాన్, పేజీలు: 528, వెల: రూ. 200/-లు

**అరాచక వ్యవస్థను మార్చివేసిన**

### ముహమ్మద్ ప్రవక్త

**"వార్త" సమీక్ష:** తెగల మధ్య పోరాటాలతో, యుద్ధాలతో బహుదేవతారాధన, జంతు బలులు, మూఢనమ్మకాలతో అరాచకంగా తయారైన అరబ్ ప్రపంచాన్ని ఉద్ధరించడానికి అవతరించిన దైవదూత ముహమ్మద్ ప్రవక్త. విశృంఖల జీవితానికి అలవాటుపడ్డ అరబ్ ప్రజలలో చిన్ననాటి నుండే సత్యసంధత, పరోపకారం, దయాగుణం వంటి సత్ప్రవర్తనలతో తనకంటూ ఒక ప్రతేకతతో ముహమ్మద్ ప్రవక్త అందరినీ ఆకర్షించ గలిగాడు.

ముహమ్మద్ ప్రవక్త మతబోధకుడే కాక సంఘసంస్కర్త కూడా. సద్వర్తనుడిగా, వర్తకుడిగా, యోధుడిగా, ప్రవక్తగా పైగంబర్ ముహమ్మద్ జీవితాన్ని గొప్పదనాన్ని తెలియజేసే గ్రంథమిది. ఏడవ శతాబ్దానికి పూర్వం అరబ్ ప్రపంచపు ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక చరిత్రను ఈ పుస్తకం తెలియజేస్తుంది. ముస్లింలే కాకుండా ముస్లిమేతరులు కూడా ముహమ్మద్ ప్రవక్త గురించి తెలుసు కోవడానికి ఈ పుస్తకం ప్రామాణిక గ్రంథంగా ఉపయోగపడుతుంది. ఈ పుస్తకాన్ని కావ్యరీతిలో, సులభసుందర శైలిలో తీర్చిదిద్దిన తీరు ప్రశంసనీయం. చరిత్ర, సంస్కృతి, మతాల గురించి ఆసక్తి ఉన్నవారు అధ్యయనం చేయాల్సిన పుస్తకం.

**-కె.పి. అశోక్ కుమార్ ('వార్త' దినపత్రిక-10.7.2005)**